శ్రీశ్రీ

# సిప్రాలి

నీ మమతల పందిరి నీడలో
శ్రీ పాదపు వెలుగుల మేడలో
నిర్మలమై నిర్వికారమై
నిలిచే భాగ్యము ఎవరికోతే

కరుణామృత సాగర తీరములో
ప్రేమాన్విత స్వర్గానందములో
పెదవులదర ఎదవణక నిలచి
నిను పిలిచే భాగ్యము ఎవరికోతే

నీ కన్నుల నీలిమ లోతులలో
నీ పెదవుల నవ్వుల వెన్నెలలో
మొద ఖేదముల నడుమ నిలచి
నిను కొలిచే భాగ్యము ఎవరికోతే॥

# రాగబంధం

రచన:

**శేష**

ప్రచురణ:

కొండముది రామమూర్తి

హైదరాబాద్

సర్వస్వామ్య
సంకలితము

ప్రథమ ముద్రణ 1983

ప్రతులు 1000

అమ్మ వజ్రోత్సవ ప్రచురణ

5 మే' 83 కళ్యాణోత్సవ సందర్భముగా

8

వెల : నాలుగు రూపాయలు

ముఖచిత్ర రచన :
అర్. రామకృష్ణ

కాపీలకు :
పబ్లికేషన్సు డివిజన్
శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి – 522114

ముద్రణ :
మాతృశ్రీ ప్రింటర్సు
బాపట్ల – 522 101.

# అంకితం

అమ్మ కళ్యాణ దినోత్సవ శుభ సమయంలో

జగజ్జనని

మాతృశ్రీ అనసూయాదేవి

పావనపాద పయోరుహ యుగళికి ఈ కవిత

సభక్తికంగా సమర్పితమైనది.

— శేష

5–5–'83

# ముందు మాట

చీరాల వాస్తవ్యులు కీ॥ శే॥ రాజుపాలెపు రామచంద్ర రావుగారి వెంట జిల్లెళ్ళమూడి వెళ్ళి మొదటి సారిగ 1960 సం॥లో అమ్మను చూచాను. 1963 సం॥ నుండి ప్రస్తుతం రైల్వే ఉద్యోగి శ్రీవల్లూరి రామమోహనరావుగారి పరిచయంతో అమ్మను గురించి చాల విన్నాను. అమ్మ దర్శన ఫలితంగా నాకు ఏమి అనుభవాలు కలుగలేదు. కాని అమ్మ సందర్శనము మనస్సుకు ప్రశాంతతను తృప్తిని చేకూర్చుతున్నది.

కీ॥ శే॥ రామచంద్రరావుగారి జ్యేష్ఠ కుమారుడే వెంకట శేషగిరిరావనే "శేషు".

శేషు గేయాలు "రాగబంధం" శీర్షికన మాతృశ్రీ సంచికలలో 1967 నుండి రెండుమూడు సంవత్సరములు ప్రచురితమైనవి.

అమ్మ వజ్రోత్సవ సందర్భంగా జరిగిన సాహిత్య కార్యక్రమాల గురించి చర్చలు శేషు వ్రాసిన గేయాలు పుస్తక రూపంలో తీసుకరావటానికి ప్రేరణ అయినది.

ఈ అవకాశాన్ని కలుగజేసినందులకు జిల్లెళ్ళమూడి విశ్వజననీ పరిషత్తువారికి కృతజ్ఞుడను.

హైదరాబాదు
5-5-83

ఇట్లు
కొండముది రామమూర్తి.

# రాగబంధం

1. నీ దయ ఉంటే

అంధుడు చూడగలడు!

మూగి మాటాడగలడు!

బధిరుడు వినగలడు!

పరశువేది స్పర్శతో

ఇనుమే బంగారం కాదా

అమ్మా!

2. చెట్టు మొదలులో నీరుపోస్తే
అన్ని రెమ్మలకూ, ఆకులకూ అందేటట్లే
సముద్రస్నానం చేస్తే
అన్ని నదులలోనూ మునిగినట్లు అయినట్లే
అమృతపానం చేసే వాడికి
అన్ని రుచులూ అందినట్లే
నీవు నా దగ్గర ఉంటే
అన్నీ అనుభవంలోకి వస్తాయి
కాదా అమ్మా!!

3. సూర్యుడికి కాంతి నీయడమూ,
కల్పతరువును పూలతో అలంకరించడమూ,
కర్పూరానికి వాసన నీయ బోవడమూ,
చందన సువాసనలు పెంచయత్నించడమూ,
అమృతాన్ని ఆరగించ డానికి యోగ్యంగా
తయారుచేయడమూ,
ముత్యానికి మెరుపునీయ ప్రయత్నించడమూ,
బంగారానికి వెండి మెరుగునీయ బూనడమూ,
నీ గొప్పదనాన్ని పొగడ యత్నించడమూ,
ఎంతవరకూ సాధ్యాలమ్మా!

4. కొల్లలుగా ధనం కావాలని పరశువేదిని కోరుకోనా?
నిధి నిక్షేపాలు వెదికే అంజనం కోరుకోనా?
కామధేనువు పాలూ, పారిజాతపు పూలూ కావాలననా?
నువ్వు కావాలని అనుకుంటానమ్మా!
నువ్వుంటే అన్నీ ఉన్నట్లే!!

5. సూర్యుడుదయించగానే చంద్రుడి కాంతి క్షీణమయినట్లే
నిన్ను చూస్తున్నంతసేపు ప్రపంచం అంతా
కాంతి హీనమవుతుందమ్మా!

6. చిన్న సెలయేరులలోనుంచి వచ్చినందుకు
నది సెలయేటి నీళ్ళను గర్హిస్తుందా?
పసిపాపడు ఆడుతూ ఆడుతూ తనమీద పడ్డాడని
తల్లి కోపగిస్తుందా?
చంద్రుడిని చూచి ఆనందంతో పిల్లలు తమ తెల్లటి
చేతులూపారని చంద్రుడు కోపగిస్తాడా?
నిన్ను నేను ఈ పేలవమైన మాటలతో కీర్తిస్తుంటే
నీవు కోపగిస్తావా అమ్మా!

7. రాముడు ధైర్యం ఇస్తుంటే
కోతులు లంకను గెలవలేదా!
చిలుకకు మాటలు నేర్పితే
అది సమయానుకూలంగా మాటాడదా!
ఇనుప గుగ్గిళ్ళు నీళ్ళలో వేసి
నీ మహిమ అంటే ఉడకలేదా!

అలాగే,

నేనూ 'అమ్మా' అని,
నీదయ ఎందుకు రాదో చూస్తాను.

8. ఏనుగులు మానససరోవరం దగ్గరికి రావడంవల్ల
చిన్న హంసలు రాకూడదనేమిటి?
రాజహంస ఎంతో అందంగా నడచిన మూలాన
భూమిమీద ఎవరూ నడవకూడదనేమిటి?
ఆకాశం సముద్రంలో ప్రతిబింబించినంత మాత్రాన
చిన్న చెలమలో కన్పించగూడదనేమిటి?
అందరూ నీకు పరిమళ భరితమైన పుష్పాలిస్తే
నేను
గడ్డిపోచలిస్తాను
స్వీకరించవా అమ్మా!

9. అవును.

చంద్రోదయం చూచి సాగరముప్పొంగినంత మాత్రాన

చంద్రుడికేం కష్టం?

తన శక్తి మూలాన ఇనుపముక్కలు

ఆకర్షింపబడినమాత్రాన

అయస్కాంతానికేం?

నిన్ను చూచి, నిన్ను చేరలేక, మేం తపనపడుతుంటే

నీకేమమ్మా!

గూటిలో దీపంలా,

మా తప్పులనూ, ఒప్పులనూ,

అన్నిటినీ చూస్తూ ఊరుకుంటావు!

10. సూర్యుడు వెలుగుతూ ఉన్నంత మాత్రాన,

అందరూ తమ పనులు చేసుకోగలుగుతారు,

చల్లగా గాలి వీస్తున్నంత మాత్రాన

అందరూ నిద్రించగలుగుతారు

రాజు ఆజ్ఞ ఇచ్చినంతలో సేనలు

అరి వీరుల నణచగలుగుతాయి

నీవు మావంక చూచినంత మాత్రాన

మేము ఆనందంతో గంతులు వేస్తామమ్మా!

11. రూపరాహిత్యానికి రూపం నీవు
నిర్గుణమే నీ గుణం,
అంధుని దృష్టి,
బధిరుని వినికిడి,
మూగ పలుకు,
కుంటివాని కాళ్ళు........
అన్నీ నీవే।
నల్లని మబ్బుల మాటున పూర్ణచంద్రుడు దాగినట్లే,
అన్ని లోకాలూ, అన్ని గుణాలూ అన్ని రూపాలూ,
నీ మాటున దాచుకున్నావమ్మా।
ఎంత దొంగవు।।

12. ఆవు పొదుగులో పాలు దాగినా,
వస్త్రం మాటున వజ్రాన్ని దాచినా,
బూడిద మాటున అగ్ని దాగినా,
మేఘం చాటున చంద్రుడు దాగినా,
అవి ఉన్నాయని అందరికీ తెలిసినట్లే,
నీవెంత దాచినా,
నీవు మా అమ్మవని మాకందరికీ
తెలుసు నమ్మా।।

13. అద్దం కెదురుగా నిలబడితే ప్రతిబింబం కనపడదా!
కెంపు పక్కన ఉన్న పలుగురాయి ఎర్రదనం
సంతరించుకోదా!

గులాబీలలో ఉంచిన గడ్డిపూవుకు ఆ వాసన
అంటకపోతుందా!

అంత మాత్రాన,
ప్రవాహం ఒడ్డున ఉన్న పర్వతం
వాహినితో ప్రవహించగలదా అమ్మా!

నా పని ఉక్క, దాలిగుంటవతే!!

14. నా మనస్సు
రాజ్యం లేని రాజులా,
దేన్ని భాస్వంతం చేయాలో
తెలీని వెలుతురులా,
ఏ పూవుకూ చెందలేని వాసనలా,
తన్ను తానే దగ్ధం చేసుకొనే నిప్పులా
ఉందమ్మా!
ఏం చేయను?

15. వినగూడనివి చెవులు వినరాదనీ,
కనగూడనివాటిని కనులే కనరాదనీ,
పలుకరానివాటిని నాలుక పలుకరాదనీ,
అనుకోవాలనీ,
వెలుతురును చూచి పారిపోయే చీకట్లలా,
నానుంచి చెడు దూరంగా పారిపోవాలని,
దరులు ముంచెత్తే వరదగోదారిలా
నా హద్దులు దాటి నేను నీపాదాలు తాకాలనీ,
పౌర్ణమినాడు లోకాలన్నిటినీ నింపివేసే వెన్నెలలా,
నీవు
నాలో అంతా నిండాలనీ,
నా కోరికమ్మా!!

16. అడవిలో ఉన్నంతమాత్రాన
చందనతరువు చందనతరువు కాకపోతుందా?
ఇంకొక చోటికి తీసుకవెళ్ళిన తరువాత
దీపాన్ని 'దీపం' అనరా?
దూరాన ఉన్నంత మాత్రాన
నక్షత్రం వెలుతురు నీయదా?
కస్తూరివాసన చిమ్మదా!
నీవు జిల్లేళ్ళమూడిలో ఉన్నమాత్రాన
నా అమ్మవు కాకపోతావా!!

17. రాజప్రాసాద ప్రాంగణంలో ఉన్న మాత్రాన
బిచ్చగాడు రాజు అవుతాడా!
మహారాజ లాంఛనాలతో ఊరేగించినా
ఎద్దు గడ్డినే గదమ్మా మేసేది!
చందనతరువును చుట్టుకొని ఉన్నా,
పాముविషం విరుగుతుందా!
అలాగే,
నీదరిని ఉన్నా.
నాదుష్టత్వం నన్ను వీడటం లేదమ్మా!

18. గుడ్లగూబ చీకటిని మాత్రమే చూడగలిగినట్లు
వద్దని నీవన్నవే నా హృదయానికి హత్తు
కుంటున్నాను.
మదిరలేకనే నాకళ్ళు మూతలు పడుతున్నాయి
సంధిలేకనే ఇష్టంవచ్చినట్లు వదురుతున్నాను.
మరి,
నాఈ రోగం
నీవే కుదర్చాలమ్మా!!

19. పుష్పాలను చేరే మధుపాలు పుష్పాలు కాలేవమ్మా!
గమ్యాన్ని చేరే బాణాలు బాణాలలాగానే తిరిగి
వస్తాయమ్మా!
అలానే,
నీదగ్గరినుంచి ఇవతలికి
మేము మా ములుకులన్నిటితోనూ
వస్తున్నామమ్మా!
మంచి నీటిపాత్రలో ఉంచిన ఉప్పు బొమ్మలా
తిరిగిరాకుండా,
నీలో మేమెప్పుడు కలుస్తామమ్మా!

20. నా సుగుణాలనుగూర్చి చెప్పుకొందామని
నాలోకినేనే తొంగిచూచానమ్మా!
వంధ్యస్త్రీ బిడ్డలను వర్ణించడం ఇంకా సులువు
అనిపించింది.
గొంగళిపురుగు అందాన్ని
గాడిద గానాన్ని
కాకి కంఠస్వరాన్ని,
ఎంతబాగా మెచ్చుకోవచ్చో నాకిప్పుడు తెలిసింది.
కానీ, అమ్మా....
ఇంత అన్యాయంగా ఉన్నానని తెలిశాక,
నీవంక ఎలానమ్మా, తేరిపార చూడటం!

21. మబ్బులు క్షణక్షణానికీ రంగులు మారుతున్నాయి.
మెరుపు క్షణం కనుపించి మాయమవుతోంది;
పోయే సంవత్సరం కొత్తవత్సరానికీ
ఒకచెరుకుకణుపు ఇంకొ చెరుకు గడకూ,
ప్రవాహంలో ఒక బిందువు మరోబిందువుకూ,
స్థానం ఇస్తున్నాయి.
మరి నామనస్సుగూడా మారిపోతే,
నీ రూపు ఇంకోరూపుకు స్థానమిస్తే,
నాకేదమ్మాదిక్కు?

22. పిల్లవాడు భయపడేబూచి నిజంగా ఉందా!
గాలిమేడలను నిజానికి పడగొట్టగలమా!
కుందేటి కొమ్ములను విరగగొట్టగలమా!
గగనకుసుమాలను కోయగలమా!
ఏమో!
ఇవన్నీ చేయగలనేమోగాని,
నీపాదాలను అందుకోవడం మటుకు
అన్నిటికంటే దుష్కరమైనపని అవుతున్నదమ్మా!

23. వజ్రాలు గదా అని బరువైన మూట మెడకు కట్టుకొని
సంద్రాన్ని ఈద ప్రయత్నించినట్లు,
అందంగా ఉందని పాలరాతి విగ్రహాన్ని
వీపునమోస్తూ
మేరువునెక్క ప్రయత్నించినట్లు.
నా
'గొప్పగుణాలనే' 'అజ్ఞానం'
విజ్ఞానమనే తెలివితక్కువ
మూటలుకట్టుకొని,
నిన్ను చేరప్రయత్నిస్తున్నాను.
ఇవి నన్నే ముంచుతాయని తెలుసుగానీ,
వీటిని వదలించుకోలేకుండా వున్నానమ్మా!
దయతో నన్ను ఈబరువునుంచి విముక్తురాలినిచేయవూ!
నన్ను నీదరికి రానీయవూ!!

24. అమృతపు సోనలో మునిగినా,
ఉక్కిరి బిక్కిరై బయటకి పడటానికి
ప్రయత్నించే వాడిలా,
ఆహారంకోసం పరితపిస్తూగూడా,
గుడ్డితనంమూలాన చూడలేక
చింతామణిని కాలితో అవతలికి తోసివేసేవాడిలా
నేత్రాలు రెంటినీ మూసుకొని,
ఏమీ కనిపించలేదనే మూర్ఖుడిలా,
నీవు మావద్దనే మామధ్యనే ఉన్నా,
నీ వెవరో తెలుసుకోలేక పోతున్నానమ్మా!

నీ ప్రేమ సంకెలలేమోననుకొని,
సన్యసించి నిన్ను వెదుకుదా
మనుకుంటున్నానమ్మా!
నా తెలివి తక్కువా? విజ్ఞానమా? ఇది:
ఏమంటావమ్మా!

25. కామెరల వాడికి వెన్నెల గూడా పచ్చగా ఉన్నట్లు,
జ్వరరోగికి పాలుగూడ చేదుగానే ఉండినట్లు
నాకు మంచి మాటలు అపథ్యంగా
ఉన్నాయమ్మా!

తన ప్రతి బింబాన్నే చూచుకొని సింహం
బావిలో దూకేటట్లు,
వజ్రాలనుకొని గులక రాళ్ళను ఏరుకొనేవాడిలా,
ఏవేవో కావాలనుకొంటూ,
నిన్ను కావాలనుకోవడం మరుస్తుండే,
నన్నెలా క్షమిస్తున్నావమ్మా!

26. సముద్రంలో పెద్ద కెరటాలూ, చిన్న అలలూ ఉండవా!
ఒక చెట్టుకు పెద్దకొమ్మలూ, చిన్న ఆకులూ ఉండవా!
అందమైన పుష్పాలూ, కుంటి పూలూ ఒకే చెట్టుకు
పూయవా?
అలాగే, మంచి వాళ్ళతోబాటు,
నా చెడుతనంతో గూడా,
నిన్ను అమ్మా అని పిలుస్తున్నానమ్మా!
క్షమించవూ!

27. ఈగలకు స్వర్గపుటంచులూ,
చేపలకు సముద్రపు లోతులూ,
పిండానికి తల్లి వయస్సూ తెలియనట్లే
నాకూ,
నీ వెవరో?
నిన్నెలా అర్చించాలో
తెలీడంలేదమ్మా!!

28. సూర్యునితేజః పుంజాలముందు చంద్రుడు తలవంచి
అంధకారంలోకి తప్పుకున్నా,
మిణుగురు పురుగులు తమ మిలమిల చూపాలని
ఆశిస్తూనే ఉంటాయి,
అలాగే,
గొప్పవాళ్ళందరూ నీముందు నిలువలేక,
ఎక్కడో దాక్కుంటే,
నేను నాగొప్పను నీముందు ప్రదర్శిస్తున్నాను.
ఎలా నవ్వుతున్నావో, ఏమో!!

29. వృక్షాన అనేక ఫలాలున్నా

బాగాపండిన వాటినే గదమ్మా ఆస్వాదించేది!

సూర్యకాంతిలో అనేక పథాలు కన్పట్టినా,

ఒక బాటనే కదమ్మా! పయనించేది!

వియద్గంగ భూమినంతా చుట్టుముట్టి ప్రవహించినా,

తన కడుపు నిండేవరకే గదమ్మా! తాగగలిగేది!

నీ కాంతిలో కనపడే వేల బాటలలో

ఏ బాట కంటకావృతమో!

ఏబాట నీ తోటలోకి దోవతీస్తుందో,

నాకెలా తెలుస్తుందమ్మా!

ఇంత అన్యాయమా!

30. ఆకాశాన్ని చుట్టచుట్టి నక్షత్రాల నొకచోట కుప్ప పోయ గలనేమో!

ప్రపంచాన్నంతా ఎత్తి ఒకచోట పెట్టి ఇవీ మొత్తం అణువులు అనగలనేమో!

కానీ,

ఎక్కడ, వేటిని చూపి, ఇవీ అమ్మపాదాలు అనగలనమ్మా!!

31. నీవు అద్దాన్ని శుభ్రించేసి నాముందుంచావు. నిజమే,
నీవు శ్రుతిచేసిన వీణపై పాటను మధురంగా గానం
చేస్తున్నావు. అది నిజమే!

కానీ,

నా గుడ్డితనం ఇంకా వదలలేదే!
నా బధిరత్వం ఇంకా తొలగలేదే,
ఏం చేయను?

ముందు నాకు చూపునూ, చెవులనూ ఈయవా అమ్మా!

32. అమృత ప్రవాహంలో ఈదులాడ భయపడేవాడిలా,
బంగారపు కొండను దాచుకొనలేనని బెంగపడేవాడిలా,
బరువని చింతామణిని పారవేసే మూర్ఖుడిలా,
మేపటం భారమని కామధేనువును బయటికి తరిమే
వెర్రిలా,

మంచిని తరిమివేసి,
చెడునే కౌగిలించుకొంటున్న
నన్నెలా క్షమిస్తున్నావమ్మా?

33. నిన్ను ఆకాశంతో పోలిస్తే....
నీచేత ఆక్రమింపబడని వస్తువు ఉండదు,
నీకివతల ఉండము గనుక.
నీపాదం ఉండని స్థలం ఉండదు,
ఆకాశంలేని చోటు ఉండదు గనుక.
నీముఖం అన్నిటిలోనూ ఉండి, అన్నిటినీ ఆనందిస్తుంది
కానీ,
ఆకాశానికి రూపం లేనట్లే,
నీవూ ఎక్కడా కనబడవు
ఎంత వింత అమ్మ వమ్మా!

34. చిన్నగాలికి ఎగిరి పోతుందేమో ననిపించే మబ్బు,
కావలసినంత వర్షం కురుస్తుంది.
వామన అరటి చిన్నదే అయినా
తీయని పళ్ళు అనేకం అందిస్తుంది.
మల్లె అంటు చిన్నదయినా, సువాసనలను
మైళ్ళదూరం విరజిమ్ముతుంది
పొట్టిగా ఉన్నానని వదిలిపెడతారులే అనుకుంటున్నా
వేమో!
ఇవన్నీ మాకు తెలుసమ్మా!
మా ఆశలు నీ చుట్టూ ఇంకా పెరుగుతున్నాయి.

35. నీ చుట్టూ ఉండే గాలిని, ఆకాశాన్నీ
కలచివేస్తుందని కాబోలు
నీ చేతినికూడా కదపవు.
మరి, అభయముద్ర చూపాలన్నా
పడినవాళ్ళను లేవదీయాలన్నా,
గాయపడ్డవాళ్ళమేనులు నిమురాలన్నా
నీ కరం సదా సిద్ధం!
ఈ వింతే మమ్మా ! !

36. సముద్రం తనలో నదులనూ, నదాలనూ,
సెలయేళ్ళనూ
కలుపుకుని ఏమీ తెలియనట్లే ఉన్నట్లు
నీకేమైతే ఏంలే, సుఖ దుఃఖాలలో ....
పూరేకులమధ్య దాగిన పుప్పొడి చినుకు కాదు,
తేనెల ప్రవాహం నీ హృదయం!
ఇం కేమనగల నమ్మా!

37. నీవొక ఆవులా, నేను లేగలా,
నేనో చేపలా, నీవు మహోదధిలా
నేనొక మొక్కలా, నీవు నా జీవన వారిలా
నేను రెక్కలురాని పక్షిపిల్లలా
నీవు నాకు ఓగిరమిడుతున్న తల్లిలా
ఊహించుకోనిస్తున్నందుకు
నా ధన్యవాదా లమ్మా!!

38. నాలో కాంతిని దీపంగా చేసి
నీ గది మూలలో,
నీవు నిద్రిస్తున్నప్పుడు వెలుగగలిగితే,
నా రక్తం నీళ్ళలా చేసి, నువు చిలిపిగా
నీళ్ళను చిందగొట్టేచోట
కలవగలిగితే,
నా శ్వాసను, నీ వింజామరగా
మార్చుకో గలిగితే
నన్ను నీపాదపీఠిగా అమర్చుకో గలిగితే,
ఎంత బావుంటుందో!!

39. నేనెవరికీ ఉపయోగించనని నాకు తెలుసమ్మా!
అందుకే నీదగ్గరికి వచ్చాను.
కానీ,
గంగలో మునిగితే గాడిద కేమిటి ప్రయోజనం?
చనిపోయిన వాడికి ఆభరణాలు తొడిగినట్లు
విధవముఖాన కుంకుమలా
పంచదార పూసిన మిరపకాయలా
నిర్జన ప్రదేశంలో చలివేంద్రంలా
తోమి మెరుగు పెట్టిన ఖాళీపాత్రలా
బయట రంగు వేసిన మట్టి పండులా
ఇంకా ఇలాగే వున్నానమ్మా!
వేడి నీళ్ళకు ఇసుక కరుగుతుందా మరి!
నీ కోపమనే లావాను రానీవమ్మా! చూద్దాం!!

40. మబ్బులు అటూ ఇటూ పరుగు లెత్తినా ఆకాశం కదలదు.
నక్షత్రాలు తిరుగుతున్నా ధృవతార కదలదు.
బాటసారు లెందరు నడిచినా బాట పలుకదు.
తుఫానులు వీస్తున్నా భూమి ఊలకదు.
అలాగే
నేనెంత పిలిచినా నీవు పలుకవు.
ఔనా అమ్మా!

41. ఎవరూ....

విషాన్నమంటే ప్రీతిపడరు.

మండే ఇంట్లో నిద్రపోదా మనుకోరు

పులి గుహలో విశ్రాంతి తీసుకుందా మనుకోరు.

పాము తలగడగా నిద్రిద్దామనీ

మరుగుతున్న ఇనుములో ఈదులాడుదామనీ

అనుకోరు.

కానీ, నీవో,.......

42. తాగుబోతు తానేం ధరించిందీ తెలుసుకోలేనట్లే

చిత్తరువుకు తన చేతిలో ఉన్న ఆయుధ మేమిటో

తెలీనట్లే,

ఎద్దుకు తాను మోస్తున్న వేదాంత గ్రంధాలు

అర్థంకానట్లే

నన్ను చుట్టివేసిన నీప్రేమ నాకర్థం

కావడం లేదమ్మా!

ఏనుగుమీద పూలవర్షంలా

నీ పిలుపు నన్ను చేరటంలేదు.

ఏం చేయనమ్మా!!

43. ఇంకా కంటి చూపు పోతముందే

నిన్ను తనివితీరా చూడాలనీ,

కాళ్ళుకుంటివి కాకమునుపే

నీదగ్గరికి వచ్చి, నీముందు తిరగాలనీ,

బధిరత్వం వచ్చేదాకా

నీ మాటలే వింటూ కాలంగడపాలనీ,

ఏ పక్షవాతమో నా చేతులను చచ్చుపడేలా

చేయకమున్నే

నీ పాదసేవలు చేయాలనీ,

ఎన్ని ఆశలున్నాయి నాకు!

అవన్నీ తీరేదెలా అమ్మా?

44\. దేవాలయ గోపురంమీద గుడ్లగూబలా,
నా గొప్పను నేనే చెప్పుకుంటాను.
ఎవరన్నా నన్ను పొగిడితే గాలికి ఆకాశంలోకి
లేచిన ధూళిలా ఉబ్బిపోతాను.
అదే ఎవరన్నా విమర్శిస్తే, నీళ్ళనుండి బయటపడి
గాలికి ఎండిన బురదమట్టిలా
తలవాల్చుకుంటాను
అడవిలోని పాడుపడ్డ బావిలాంటివాడిని నేను
లోపల అన్నీ ఎముకలూ, బయట అన్నీ ముళ్లు
కొలనులో కాలిడగానే బురద లేచినట్లు
ప్రతి చిన్న భయమూ నాలో అలజడిని
రేపుతుంది.

ఏవేవో మృగతృష్ణలను చూచి పరుగులిడే
ఎడారి ఒంటెలా
ఏ వాసనలో వలచి పరువులెత్తే చమరీమృగంలా
ఈ జీవన పథంలో ఎందుకో పరుగిడుతున్నాను.
రాతికిలానే నా హృదయానికీ ఏ కన్నీరూ అంటదు.
చిన్న కొలనులో చేపలాగా, ప్రమిదెలో
వత్తిలా ఉన్నా
ఎల్లకాలం ఉంటాననే నా ఆశ
ఉరికంబందగ్గరికి వెళ్ళేటప్పుడు ప్రతిఅడుగూ
మృత్యువును దగ్గరచేస్తుందని
అనుకోనమ్మా నేను.

పులి గుహనుంచి సురక్షితంగా ఇవతలికి వచ్చిన
ఎద్దు మళ్ళీ వెళ్ళాలని ఆశపడ్డట్లు,
పాముదగ్గరి ధనరాసులు మళ్ళీ మళ్ళీ
తెద్దామనుకున్నట్లు,
చెడుజోలికే మళ్ళీ మళ్ళీ వెళతాను నేను.

వినగూడనివి వినాలనీ, అనగూడనివి అనాలనీ,
చేయరానివి చేయాలనీ, నడవ రాని ద్రోవ
నడవాలనీ,
ఎన్నినా కోరికలు?

పైగా నాకన్నీ తెలుసుననీ, నా అంతవాడు
శాస్త్రాలలోనూ, ఆగమాలలోనూ,
స్మృతులలోనూ, శ్రుతులలోనూ, భాషలలోనూ,
వ్యాకరణంలోనూ,
కళలలోనూ, సాహిత్యంలోనూ—
ఒకటేమిటి? ఏ విభాగంలోనూ లేడని
నాకెంతటి గర్వం?

కానీ,
నెమలికి వేయి కన్నులున్నా ఏకంటితోనూ
చూడలేనట్లే,
ఎన్ని తెలుసుకున్నా నీవు తెలియక

ఎన్ని వెదికినా నీవు కనపడక
ఎంతపిలచినా నీవు పలుకక
నిస్సహాయుడనై
నాచేతగాని తనాన్ని ఈనాడు నీముందు
ఒప్పుకుంటున్నానమ్మా!
ఇంకా కోపగించుకోక నాదరికి రావూ!!

45. బురదలో కూరుకుపోతున్న ఆవును వెలికి తీసేముందు
పాడి ఆవా, గొడ్డుటావా అని చూడవు కదమ్మా!
నదిలో మునుగుతున్నవాడు
బ్రాహ్మణుడైనా శూద్రుడైనా
ముందు రక్షిస్తావు గదమ్మా!
అలాగే,
ముందునన్ను నీదరికి చేర్చుకొని
తర్వాత నాదోషాలను నీ చూపులమంటలతో
కాల్చివేయమ్మా! ఏం!

46. ఎంతపొగ అయినా ఒక చిన్న గాలి విసరుకు చెల్లా
చెదరు కాదా అమ్మా!
మరినీకెందుకింత సందేహం! నాపాపాలు నీగాలికి
ఎగిరిపోవని!!

47. పందెపు గుఱ్ఱం ఉచ్చైశ్రవాన్ని చులకనచేసినట్లు

రంగులుమార్చే ఊసరవెల్లి ఇంద్రధనుస్సును

తేలికగాచూచినట్లు

గడ్డిని మాత్రమే కాల్చగలిగేనిప్పు ఆకాశాన్నంట

ప్రయత్నించినట్లు

నాగొప్పలమీద నాకు మూఢవిశ్వాసం

అందుకే ఇతరులను చులకనచేస్తాను.

కానీ,

నెత్తిమీదమబ్బుతునక ఓక్షణకాలం నీడనిచ్చినమాత్రాన

ఇల్లు కూలదోసుకొనే వాడిలా,

ఒకరోజు ప్రక్కవాడు విందుకు పిలిస్తే నెలలతరబడి

విందులొస్తాయనుకునే వాడిలా,

మృగతృష్ణలుచూచి ఇంటిబావిని పూడ్పించుకొనే

మూర్ఖునిలా

ప్రవర్తిస్తున్నానని నీకు తెలుసు!

మరి నాకెందుచేత చెప్పవమ్మా!

48. లోకాలకు వెలుగునిచ్చే దినకరుడు

దొంగకు ప్రాణాంతకుడుగా తోచినట్లే

చంద్రుడినిచూచి బాధకలిగి

నక్కలు ఏడ్చినట్లే

భాస్వంతమైన పగటినిచూచి

గుడ్లగూబ ఓర్వలేనట్లే

పాలైనా పాముతాగిన తర్వాత

విషంగా మారినట్లే

నీ పదాలుచూచి ఓర్వలేనివారూ ఉంటారా అమ్మా!

49. చీకట్లుకే చీకటి అనిపించేనన్నుచూసి

పాపం భయపడుతోంది

లోభత్వానికి విసుగు పుడుతోంది

మురికికి నేనెక్కడ తననుమురికి చేస్తానో

అనిపిస్తోంది

వేడిమికి నాపేరు మంటలెత్తిస్తోంది....

అంటరానితనం నన్నంటరాదని నియమం

చేసుకుంది.

ఈ చీకట్లు పోకార్చే దెవరమ్మా! నీవుకాకుంటే!!

50. అవునమ్మా!

రాళ్ళు అన్ని చోట్లాదొరుకుతాయి: చింతామణి
మాత్రం దొరకదు.
నీరాలూ, క్షీరాలూ అన్నిచోట్లా ఉన్నా క్షీర
పాటున గూడ అమృతం దొరకదు.
నాకు అన్నీ అందుతున్నాయి కానీ,
నీ పాదాలే దొరకటంలేదమ్మా!!

51. దీపం తనయజమానికి వెలుగునిచ్చి ఇతరులకు
అంధకారాన్ని సృష్టిస్తుందా అమ్మా?
గొడ్డలి తీసుకు వచ్చేవాడికీ, నీరు పోసేవాడికీ ఇద్దరికీ
చెట్టు సమానంగా నీడ నివ్వదా?
గానుగాడేవాడికి చేదుగాను, పెంచినవాడికి
తీయగానూ చెరుకు ఉండగలదా?
గాలి ఒకచోట వీచి వేరొకచోట కదలకుండా
ఉండగలదా?
వర్షం కురవడంలేదని కోపగించి సముద్రం
ఎండుతుందా అమ్మా?
నేను మూర్ఖుడనై నిన్ను చేరకపోతే,
నీవు కోపగిస్తావా అమ్మా!!

52. ఎదురుగా అద్దం ఉన్నా, చూడటానికి కళ్ళు
చేతిలో ఆభరణం ఉన్నా చూడటానికి వెలుగూ
కాలికింద బాట ఉన్నా కన్పడటానికి సూర్యుడు
కావలసినట్లే,
ఎదురుగా నీవున్నా,
నిన్ను చూడటానికి కావలసినదేదో
నాలో లేదమ్మా!

53. మబ్బులులేని ఆకాశంతోనూ,
మచ్చలులేని పూర్ణచంద్రుడితోనూ,
మంద్రాచలమూ, కాలకూటమూ, బడబానలమూ
బయటికి వచ్చేశాక
పాలసముద్రంతోనూ,
నాగుబాములు పారిపోయిన మంచిగంధపు తోటతోనూ,
నీ మనస్సును పోల్చ వచ్చేమో!
ఔనా అమ్మా!

54. కొండమీదనుంచి పాదం చేరాలని ఆత్రంతో
దొర్లుకుంటూ వచ్చేరాయిలా,
నీ పాదం నలిగి పోతుందనే ధ్యాసకూడా లేకుండా,
నీ పాదాలమీద పడుతున్నానే!
నన్నెలా క్షమిస్తున్నావమ్మా!

55. పరశుస్పర్శతో బంగరైన ఇనుముకు
తుప్పు పట్టదుకదా!
నిద్రి మెలకువవచ్చాక స్వప్నం బాధ పెట్టదుగదా!
సూర్యుడువచ్చాక మరిచీకట్లు నిలువవుగదా!
నీపాదస్పర్శతో పునీతమైనా ననుకుంటున్న
నాకెందుకింకా ఈ గర్వపుతప్పు?
చెప్పవా! అమ్మా!

56. పోగొట్టుకున్న వస్తువు దొరికేలోగా దీపం ఎవరు
ఆర్పివేసుకుంటారమ్మా!
నది మధ్యలో పడవదిగే మూర్ఖుడెవడు?
ఇంకా గెలవేయని అరటిని, పూవుపూయుగానే
కొట్టివేసే దెవరమ్మా!
అప్పుడే నీ పాదాలు వదులుతానని
ఆశపడుతున్నావేమో!
అదేం కుదరదమ్మా! ముందే చెపుతున్నాను.

57. చెడు రూపంలో ఉన్న చెడునరకానికీ
మంచి రూపంలో ఉన్న చెడు స్వర్గానికీ
రహదార్లు
కానీ, ఈరెండూ నీ పాదాలను చేర్చలేవుగా!
కల్పభూజం క్రింద కూర్చుని,
కొత్త జోలె కోరుకొని,
పాతజోలె మంచిదో, కొత్తది మంచిదో చూచుకొనే
తెలివితక్కువ బిచ్చగాడిలా, స్వర్గ నరకాలనుంచి
చెడుగులాలోచిస్తున్నానేగాని,
నీ పాదాలను చేరటం ఎలా అనేది
ఆలోచించని
నన్నేమనాలమ్మా!

58. ఈదేవాడి నడుం పట్టుకొని అవతలిగట్టు చేరేవాడు
తన ఈత నెలా పొగుడుకోగలడు?
రాజముద్ర సహాయంతో రాజును మోసం చేసినవాడు
తాను రాజుననీ
బలిపీఠం దగ్గరి పూజారి ఇచ్చే బలులన్నీ
తనే ఇస్తున్నాననీ
ఆలకాపరి ఆవుల పాలన్నీ తనవేననీ
అనుకో గలరా?
అలాగే,
నీమీద ఆధారపడ్డ నేనేమని మాటాడనమ్మా!!

59. రాజవీధిన నడుస్తున్నదీ, వంకరదారివెంట
పరుగిడుతున్నదీ
రథానికి తెలుస్తుందా అమ్మా!
మట్టిలో ఉన్నదీ, మకుటాలలో ఉన్నదీ
వజ్రానికి తెలుస్తుందా అమ్మా!
దొంగచేత ఉన్నదీ, దొరచేత ఉన్నదీ
నగకేం తెలుసునమ్మా!
నేను నడిచేతోవ మంచిదో, చెడుదో,
నాకు తెలియదమ్మా!
అందుకే సారథిగా నిన్నెంచుకున్నాను!!

60. నల్లమందుభాయికి మంచిమాటలు తలకెక్కనట్లే
గంగలో ముంచినా, మధుపాత్రకు మంచి అంటనట్లే
నాకూ నీ ప్రేమ వంటపట్టడంలేదు
అంతుపట్టడమూ లేదమ్మా! ఏం చేయను?

61. సూర్యుడికి
నక్షత్రాలు ఎప్పుడు మాయమౌతాయో
చీకటి ఎప్పుడు అంతమవుతుందో
కలువలెలా వికసిస్తాయో
తెలీనట్లే
నీదయ ఎలా ఉంటుందో, నాకు తెలీటంలేదమ్మా!

62. గాలికి ఇచ్చివేసిన పరిమళంకోసం పూలు తిరిగి
ఎదురు చూడనట్లే
వదలివేసిన కుబుసాన్ని పాము
అంటిపెట్టుకొని ఉండనట్లే
తన వెన్నెల మళ్ళీ తననే చేరాలని చంద్రుడు
అనుకోనట్లే
నా చెడునే పట్టుకొని నే వేలాడ గూడదని
నా అభిలాష అమ్మా!

౬౨. ఎవరయినా వందచిల్లులున్న పడవలో ఎక్కి
ధైర్యంగా ఉండగలరా?
రాళ్ళు విసురుతుంటే నాకేమని సంతోషంగా
ఉండగలరా?
రోగి మందులు నాకవసరం లేదని అని మనగలడా?
మండుతున్న ఇంట్లో ఎవరైనా నిద్రపోదామనుకో
గలరా?

ముందు భద్రతా, సంతోషమూ, శాంతీ
అందరికీ కావాలి గదమ్మా!

అందుకే నేనూ నీ దగ్గర ఉండాలని
ఆరాటపడుతున్నానమ్మా!

తేళ్ళను పక్కపరుచుకొని నిద్రించగలిగే దెవరు?
విషవృక్షం పాలుతాగి అమరత్వం పొందాలంటే
వస్తుందా?

అందుకేనమ్మా, నేను నీపాదాలకోసం
ఆరాటపడుతూంట!

64. భార్య లేకుంటే వంటచేసేవారెవరనీ,
ఉంటే ఆమెను గురించి చింత.
పిల్లలెక్కువమంది ఉంటే పోషించడ మెలాగనీ,
అసలే లేకుంటే పిండోదకాలెలాగనీ చింత.
ఇల్లు లేకుంటే వర్షంనుంచి తలదాచుకోవడ మెలాగనీ,
ఉంటే పన్నులుకట్టడ మెలాగనీ చింత.
డబ్బు లేకుంటే అడుక్కుతినాల్సి వస్తుందనీ,
ఉంటే దొంగలు పడతారనీ చింత.
అలాగే,
నేను నీదగ్గర ఉంటే పోవాల్సివస్తుందేమోననీ,
దూరంగా ఉంటే నీదగ్గరికి రావాలనీ చింతమ్మా!

65. పామునోటిలో ఉన్న కప్ప పురుగులను తిందామని
ప్రయత్నిస్తున్నట్లు,
నన్ను మోసగించే వాళ్ళున్నారని తెలిసే
నే నితరులను మోసం చేయటానికి
ప్రయత్నించడం చూచి
నీకు నవ్వుగా ఉంది కదమ్మా!

66. నిప్పులోవుంచాక గానుగకర్రా, చందనకాష్టమూగూడా
తమతమ ప్రత్యేకతలు కోల్పోయినట్లే
సముద్రంలో కలిసి ఉప్పు తనరూపం కోల్పోయినట్లే
మురికినీటి కాల్వలు గంగలోకలిసి తమ స్వరూపం
కోల్పోయినట్లే
నీ పాదాలముందు సురిగిపోయీ,
నీలో ఒరిగిపోయీ,
నన్ను నీలో పోగొట్టుకోనీయవాఅమ్మా!

67. మర్రిచెట్టున కాసిన పళ్ళు కాకులకు మాత్రమే
ఆహారం అయినట్లు
పంచభక్ష్య పరమాన్నాలూ రాజవీధిపై ఉంచితే
కుక్కలు తినేటట్లు
నా చేతలోగూడా
నిన్ను తలపక పోవడంచేత
నిరర్థకమౌతున్నాయమ్మా!

68. గంగకు సముద్రం మాత్రమే గమ్యస్థానమయినట్లు
వర్షజలానికి భూమితప్ప వేరేదీ కనపడనట్లు
శేషువుకు నీకు పాన్పుకావడంతన్న వేరేమీలేనట్లు
నాకు నీపాదాలు తప్ప వేరే ఏమీ లేకుండా
చేయవా అమ్మా

69. అన్ని అవయవాలూ శరీరానికి సంబంధించినవే
అయినప్పుడు
అన్ని ఆకులూ, కొమ్మలూ వృక్షభాగాలే అయినప్పుడు
సహస్రకోటి కిరణాలూ సూర్యుడివే అయినప్పుడు
లోకంలో ప్రేమ అంతా నీ ప్రేమేనని నేనంటే
కాదంటావెందుకమ్మా!

70. ఎంత నీరుపోసినా వసంతంరానిదే తోట చిగురించనట్లు
ఎంత యత్నించినా వర్షంలేనిదే ధాన్యం
మొలకెత్తనట్లు
ఎన్ని మబ్బులున్నా గ్రీష్మంలో వాన కురవనట్లు,
నీవు లేనిదే ఈ బ్రతుకెలా చిగురిస్తుందమ్మా!

71. నీవు సూర్య చంద్రులకన్నా ఎక్కువ
ఎందుకంటే సూర్యుడు అస్తమిస్తాడు;
చంద్రుడు క్షీణిస్తాడు.
నీ వెలుగుమాత్రం శాశ్వతం.
నీ ఠీవి సింహపు ఠీవికన్నా ఎక్కువ,
మృగరాజుకున్న క్రౌర్యం నీకు లేదు గనుక.
నీనేర్పు హంసకన్నా ఎక్కువ,
నీకు నీరూపాలూ, మంచీ, చెడూ, గొప్పా,
బీదా, అన్నీ ఒకటే గనుక.
నీ సహనం భూమికన్నా నిజంగానే ఎక్కువ,
ఎందుకంటే నా మాటలు వింటూ, నాచేతలు
చూస్తూ, ఇంకా నన్ను నీ
బిడ్డలా చూస్తున్నావు గనుక,
ఔనా అమ్మా!!

72. వేడినుంచి రక్షణకోసం సూర్యుడిని
గొడుగుగా వేసుకొన్నట్లు
చలిబాధనుంచి తప్పించు కోడానికి
మంచుదుప్పట్లు కప్పుకున్నట్లు
పళ్ళుఊడిపోయాక ఆకలితీరడానికి
ఇనపగుగ్గిళ్ళు తినదలచినట్లు
నా తెలియని తనాన్నుంచి బయటపడటానికి
ఇంకా తెలియని తన్నాన్నే ఆధారం
చేసుకుంటున్నాను నేను
ఏలాగమ్మా!

73. ఇంద్ర భవనంలో ఉండివచ్చాక పూరిగుడిసె
కంటికి నచ్చుతుందా!
అమృతం తాగిన తరువాత కొబ్బరినీళ్ళురుచి
అని పిస్తాయా!
అలాగే నీదగ్గరినుంచి వచ్చాక,
నేనంటే నాకెంత అసహ్యంగా ఉందో
ఏమని చెప్పమంటావమ్మా!

74. రజ్జువునుచూచి సర్పమని భ్రమపడినా, రజ్జువు
మాత్రమే నిజం అయినట్లు,
అలలు కల్లలై నీరాలుమాత్రమే నిజం అయినట్లు,
నేను అబద్ధమూ, నీవుమాత్రమే నిజం.
అవునా అమ్మా!

75. బంగరు ఆభరణంలో ఓ రేణువులా
హిమాలయాలలో ఓ మంచు తునకలా
సూర్యకాంతిలో ఓ కిరణంలా
సింధువులో ఓ బిందువులా
నీలో నేనుండిపోవాలనుకుంటే
తప్పా అమ్మా!

76. మబ్బు తునక తనలో దాచుకోలేని రహస్యాన్ని
వాన చినుకులలో అందరికీ అందించినట్లు
విరిసిన గులాబీ రాజుకూ, పేదకూ
పదేపదే ఒకేలా వాసనల నందించినట్లు,
నా మనస్సు ఒకే మాట పదేపదే అనాలనీ
ఒకే పాట పదేపదే పాడాలనీ
ఆనందంతో ఆడాలనీ
ఎగసి పడుతోంది
ఆపాట నీకు తెలుసుగదమ్మా!

77. భూమి మంచినీ చెడునూ భరించినట్లే
నది పులి దాహాన్ని, ఆవు దప్పికనూగూడా తీర్చినట్లే
నీవు నామీద దయచూపిస్తున్నావమ్మా!

78. ఒక దర్పణంముందింకో దర్పణాన్నుంచితే
దేని బింబం దేనిలో కనవడుతున్నట్టు?
ఒక సూర్యుడి ముందింకోసూర్యుడుదయిస్తే
ఎవరు ఎవరికి వెలుగునిస్తున్నట్టు?
నీ మనసుముందు నామనసుంటే
నీ ప్రతిబింబం నాలోనా,
నా బింబం నీలోనా కన్పట్టేది?
అయినా
కస్తూరినుంచి వాసననూ
వజ్రంనుంచి మెరుపునూ
ఎవరూ తీసివేయలేనట్లే,
నానుంచి నిన్నూ
నీనుంచి నన్నూ
ఎవరమ్మా? వేరుచేయగలిగేది?

79. చంద్రుడున్న చోట వెన్నెల
శివుడున్న చోట పార్వతి
రాజున్న చోట సేన
మంచితనం ఉన్న చోట స్నేహితులూ
అగ్ని ఉన్న చోట మంటలూ
సంతోషం ఉన్న చోట భగవంతుడూ
వసంతంలో పూవులూ
పూలలో మధువులూ
సూర్యుడున్న చోట వెలుతురూ ఉన్నట్లే,
నీవున్న చోట,
ప్రేమా, దయా, కరుణా,
నీవున్న చోట నీ బిడ్డలూ,
ఉండి తీరుతారమ్మా!

80. దినకరుడు వెలుగు తనకోసమేనని దాచుకుంటే
అమృతం సుధాంశుడికి తనకోసమే ఇవ్వబడితే
సముద్రజలాలను మబ్బులు తమ దాహ నివృత్తి
కోసమే ఉపయోగించుకున్నట్లయితే
నిన్ను నీవు దాచి ఉంచుకోవచ్చు!
అంతేగాని,
ఇప్పుడు మాకు అర్థం లేకుండా దాగడం
అన్యాయమమ్మా!

81. రెండు పెదవులూ కలిసి ఒకేమాట అన్నట్లు
రెండు కళ్ళూ ఒకే దృశ్యాన్ని చూచేటట్లు
రెండు చెవులూ ఒకే మాటను వినేటట్లు
రెండు కర్రల రాపిడికి ఒకేధ్వని పుట్టినట్లు
రెండు వెదురులతో తయారైన వీణ ఒకే నాదం
పలికినట్లు,
నీ మాట నా మాట కావాలనీ,
నీ చూపు నాచూపు కావాలనీ,
నీ తలపు నా తలపు కావాలనీ,
నా కోరికమ్మా!

82. పచ్చదనం, గట్టిదనం, మెరుపూకలిసి బంగారం అన్నా
అవి పూర్తిగా బంగారాన్ని వర్ణించలేనట్లే
మెత్తదనం, తెల్లదనం, సువాసనకలిసి
కర్పూరంఅన్నా
అవిమాత్రమే కర్పూరపు గుణాలుకానట్లే
తీపిదనం, పరిమళం, చిక్కదనం కలసి అమృతానికి
రూపమిచ్చినా
అవిమాత్రమే అమృతపు గుణాలు కానట్లే,
ప్రేమ, దయా, మంచితనం ఈమూడు గుణాలూకలిసి
నీవుగా రూపొందాయని మేమన్నా
అవిమాత్రమే నిన్ను పూర్తిగా వర్ణించలేవు కదమ్మా!

83. నిన్ను గొప్పగా పండిత పరిభాషలో పొగుడుదామని
'నిన్ను నీవు తెలసికొన్న అమ్మా' అన్నాను.
కానీ, అది నాచేతగాని విమర్శ మాత్రమే అయింది.
ఎందుకంటే నిన్ను నీవు ఒకప్పుడు తెలిసికో లేదనే
అర్థం అందులో
దాక్కుని ఉందిగా!
ఏం చేయనమ్మా
మాటలుకూడారావు నాకు
క్షమించవూ!!

84. నిన్ను వర్ణిద్దామని అనుకున్నానుగానీ
సూర్యుడున్నప్పుడు దీపం వెలిగించేవాడినిచూచీ
మేలుకున్నవాడిని నిద్రలేపేవాడినిచూచీ
భోజనంచేసిన వాడికోసం వంట చేసేవాడినిచూచీ
నవ్వినట్లు నవ్వుతారేమో
నన్నుచూచి అని భయం వేసిందమ్మా!

85. తన్నుతాను గాయపరుచుకోలేని కత్తిలా
తన్నుతా చూచుకోలేని కన్నులా
తనరుచి తనకు తెలీని రసనలా
తన్నుతాను కాల్చలేని నిప్పులా....
కళవళ పడుతున్నా నమ్మా!
ఎందుకంటే, మిట్టమధ్యాహ్నం వెలిగించిన
ప్రమిద లేనిచీకట్లను పారద్రోలలేనట్లే
సూర్యుడిని మిణుగురు పురుగులతో వెలిగింపలేనట్లే
మాటలు నిన్ను కీర్తించడానికి
పనికిరాకుండా పోతున్నాయమ్మా!

86. దీపం సహాయంతో సూర్యుడిని
చూదామనుకునే మూర్ఖుడిలా
మృగతృష్ణలో నీళ్ళను తాగుదామను కొనేవాడిలా
ఇంద్రధనుస్సుకు బాణం సంధిద్దామనుకొనే వాడిలా
నిన్ను తెలుసు కుందామనుకున్నాను.
కానీ,
తెలుసుకోలేనని మాత్రమే తెలుసు కున్నానమ్మా!

87. దాక్కోవటానికి గోతంలోదూరి తన్నుతానే
బంధించుకొని పట్టుపడే దొంగలా
నీ ప్రేమను దొంగిలిద్దామని వచ్చి,
నీ పాదాల సంచిలోనన్ను నేనే బంధించుకొని
పట్టు పడ్డానమ్మా నేను!
ఏం శిక్ష విధిస్తావో మరి!

88. కంటికి బాధ కలిగించని దానిని దృష్టి దోషమనీ
కాలని దానిని అగ్ని అనీ
మెలకువను కదిలించని దానిని నిద్ర అనీ
అన్నట్లుందమ్మా!
నిన్ను ఏవేవో పేర్లతో పిలుస్తుంది!

89. వ్రాయని అక్షరాలను తుడిచివేయటమూ
చీకటీ, వెలుతురూ కవలపిల్లలుగా పుట్టటమూ
మరణం మరణించడమూ
నిద్ర నిద్రించడమూ
అంధకారం చీకటిబావిలో పడడమూ
అన్నీ సంభవాలు కావచ్చునేమోగానీ,
నీవు నా అమ్మవు కాకపోవడంమటుకు
అసంభవం !!

90. తన ప్రకాశంతో పరిసరాలన్నీ చంద్రోజ్వల
భాసమానంచేసే వెలుగుముద్దను
ఏ వజ్రమనో అనడంకన్న తెలివి
తక్కువ ఉండనట్లు
నిన్ను వర్ణించడం కన్న
తెలివితక్కువ ఉండదుగదమ్మా!

91. వీడొక లక్క పెట్టె లాంటివాడు
వాడిలో నేను ప్రవేశిస్తే కరిగిపోతాడు
అని భయమా అమ్మా!
అప్పుడు నీ లోపలా, బయటా,
నీ రూపమైన అగ్నే అయి,
నేను నీలో కలిసిపోతాను గదమ్మా!
కానీ ఆభయంకూడా వద్దులే అమ్మా!
వెన్నెలను ఒళ్ళో పోసుకున్న మాత్రాన
కాలుతుందా!
నీవే చెప్పమ్మా!

92. వేయిదళాలున్నా పద్మంఒకటేగా!

పొగులనేకం ఉండవచ్చుగానీ, అన్నీ చీరపొగులేగా!

చంద్రునిచుట్టూ ఎంతదూరంఉన్నా చంద్రకాంతేగదా

అమ్మా!

ఎన్ని కీలలతో ఎగసిపడుతున్నా మంటనుంచి

కీలలు వేరా?

సహస్రకోటి కిరణాలూ సూర్యుడినుంచివేరా?

ఎంత నురుగుతో పరుగులు తీసినా

అలలు నీరులేందే మనగలవా అమ్మా!

అలాగే,

వింతలు చూదామని

ఎన్నెన్ని పథాలలో పరుగులిడినా

మేము నీనుంచి వేరెలా అవుతామమ్మా!

93. ఒకటినుంచి ఒకటితీసివేస్తే సున్నమాత్రమే మిగిలినట్లు
ఏవో రెండు సముద్రాలుకలిస్తే పేర్లు మాసిపోయి
నీరుమాత్రమే మిగిలినట్లు
నానుంచి నిన్ను తీసివేస్తే శూన్యం మిగలాలనీ
నా వ్యక్తిత్వం నీలోకలిసి రూపు మాసిపోవాలనీ
నాకోరికలమ్మా!

94. వాసనే నాసికై తన్నుతాను ఆఘ్రాణించినట్లు
దర్పణమే కన్నుగామారి తన్నుతాను చూచుకోగల్గినట్లు
శబ్దమే కర్ణమై తన్నుతానాకర్ణించినట్లు
నేను నీవుగా మారితే నిన్ను చూడగలనేమో
గదమ్మా!

95. కర్పూరం కంటికి తెల్లగానూ
చేతికి మృదుస్పర్శగానూ
నాసికకు సువాసనగానూ
అనుభవానికి వచ్చినట్లే
చంద్రికాంతి కంటికి తెల్లగానూ
స్పర్శను శూన్యంగానూ
అనుభవానికి చల్లగానూ ఉన్నట్లే,
నీవు తెలిసినవారి కొకరకంగానూ,
నాబోటివాడి కొకరకంగానూ
కనపడుతున్నావేమోనని నా అనుమానం!
నిజమేనా అమ్మా!

96. నీ దగ్గరికివచ్చి
మళ్ళీ మళ్ళీ తిరిగి ఎక్కడకో చేరేనన్నుచూస్తే
పైకెగిరి క్రిందపడీ
మళ్ళీ మళ్ళీ ఎగిరే బంతినేమో అనిపిస్తోందమ్మా!
అయితే
నీవు నాతో ఆడుకుంటున్నావో
అర్థం కావడం లేదమ్మా!

97. ఒకే శిలనుంచి దైవ విగ్రహాన్నీ
దేవాలయాన్నీ
ద్వారపాలకులనూ మలచినట్లే
నీవు
మంచివాళ్ళనూ చెడ్డవాళ్ళనూ మలచావేమో!
శిల్పికి అంతా ఒకేరాయి అని తెలిసినట్లే
నీకూ అసలు రహస్యం తెలుసేమో!
అందుకేనా అమ్మా! నీకు అందరూ సమానంగానే
కన్పిస్తారు!
చెప్పవా?

98. అమ్మనన్నావు
నాకు జన్మనిచ్చావు
బాగానేఉంది.
కానీ,
నిన్ను చూచే చూపుగానీ, నిన్ను వర్ణించే
మాటనుగానీ
సృష్టించలేదు నువ్వు!
మరి నిన్నెలా చూడను?
ఏమని పిలువను?
ఇంత అన్యాయంచేస్తే ఎలా అమ్మా!

99. ఒకవేళ,

నామీద దయచూపిస్తే నీకున్న
దయాప్రవాహం కొరతపడుతుందనీ,
నీ ప్రేమఖని తరిగిపోతుందనీ, ఆలోచిస్తున్నావేమో!
ఔనా అమ్మా!
అయినా,
చకోరి చంద్రకిరణాలమీద బ్రతికినమాత్రాన
చంద్రకాంతి తరిగిపోతోందా!
వారిదం చాతకపక్షి దాహాన్ని తీర్చినమాత్రాన
ఘనం తరిగి పోతోందా!
తల్లిపక్షి ఉదయాన్నే ఎగిరిపోతే, సాయంత్రం
వచ్చేదాకా, గూటిలో కూర్చుని
ఎదురులు చూచేపక్షి పిల్లలా,
నీ దయకోసం నేనిక్కడ ఎదురు
చూస్తున్నానమ్మా!
ఓసారి రావూ!!

100. నీ వెలాగూరావులే అని విసుగెత్తి, నీదగ్గరినుంచి
నిన్ను సీమానానికి వదలివేసి
వెళ్ళిపోతాననేనా నీధీమా!
పాపం! ఎంత ఆశమ్మా!

నా జీవన లతను నీ పాదానికి కట్టివేసి,
ఒకకొసను చేత్తోపట్టుకొని మరీ వెళతాను.
నే వెళితే, గిళితే,
అప్పుడిక నేరమ్మన్నప్పుడు రాక నీ వేం చేయుగలవమ్మా
నా గుండెనే బందిఖానాచేసి నిన్ను అందులో బంధించి
వేస్తాను
ఇంకెక్కడికి పోగలవు నీవు?

అయినా, ఇంతకష్టం వద్దనే నేను పిలచినప్పుడు
రమ్మని ప్రార్థిస్తున్నానమ్మా!
నీవేమో పెడచెవి నిడి వినటం లేదు!
ఏం చేయునమ్మా!

101. బ్రతికి ఉన్న పూలలో నిర్జీవమైన రాతిని
పూజించడమేమిటనీ
పచ్చని మారేడు ఆకులుకోసి రాతి శివలింగంపై
వుంచడమేమిటనీ
బ్రతికివున్న గొర్రెలను చంపి, ఏదోయజ్ఞం
ఎవరి తృప్తికొరకో చేయడమేమిటనీ,
జీవించిఉన్న పాములను చంపుతూనే వేరొకవంక
మట్టిపాములను
పూజించడ మేమిటనీ
ఇన్నాళ్ళు నా సందేహం!
ఇప్పుడో తమాషా చేయబోతున్నాను నేను.
జీవంతో తొణికిసలాడే నీముందు
నిర్జీవమూ, నిస్తేజమూ అయిననన్ను నేను
సమర్పించు కొంటున్నాను
ఓరివెధవా! ఇదా నీతమాషా అని కోప్పడ బోకేం
ఏం పలుకవేమమ్మా!

102. 'నేను లేకముందు మీరెలా ఉన్నారురా మరి'
అంటావేమో!
సూర్యుడుదయించక ముందు మృగతృష్ణలేదమ్మా!
సూర్యాస్తమయం తర్వాతా ఉండబోదది!
అలాగే, నీ కంటె ముందూ మేములేము
నీవు లేక ఉండనూబోము

103. నీకేవేవో చీరెలూ, నగలూ, సారెలూ, పూలూ ఇచ్చి
బదులుగా నీ ప్రేమకోసం బేరమాడే
నన్ను చూచు కుంటుంటే
నాకే సిగ్గువేస్తోందమ్మా!
నీ ప్రేమకు బదులుగా ఈయదగిన ప్రేమ నాకు లేదు!
ఏం చేయనమ్మా!
ఎలా దొరికేను నీ ప్రేమ?

104. కొంటె పిల్లవాడికి సహజమైనట్లే,
నేను నాబరువైన పాపాలరాశిని
ఒకడినే ఎత్తి అవతలపారవేదా
మనుకున్నానమ్మా!
కానీ, కదిలించానో లేదో, అది నాచేతిమీదనే పడిందమ్మా!
నా చేయి దాని బరువుక్రింద అణిగిపోతోంది.
విదలించుకోవాలనీ ఆరాశిని తోసివేయాలనీ
ఆదుర్దాయేగానీ,
అది మాత్రం కదలడం లేదమ్మా!
ఇక చేసేదేముంది,
'అమ్మా'! అంటూ ఏడుపుమొదలు పెట్టాను.
సహజమేగదూ!
మరినీవు త్వరగా రావాలమ్మా! లేకుంటే నాచేయి
బయటికి రాదమ్మా!
రావూ?

105. మామిడి మొక్కను నాటావు, బాగానేవుంది.

అది ఇప్పుడు ఫలభరితమైంది.

మరి ఇంకా ఫలాలను ఆరగించడానికి

ఆలస్యం ఎందుకమ్మా!

రోజులు జరిగినకొద్దీ పండ్లలోని తీపిదనం

తరిగిపోతుందనీ

వడిలిపోయి నేల రాలిపోతాయనీ

నిజంగా నీకు తెలియదా అమ్మా!

106. నిన్ను మాత్రమే ప్రేమించే

నా చుట్టూ అనేక సుందరవస్తువులనుంచి

నా దృష్టి మార్చాలని

దొంగ ఆలోచనలు చేస్తున్నావు

ఇది నీకు న్యాయమేనా అమ్మా!

107. మామిడిపండును నైవేద్యం పెడుతూ

కొంచెం గిల్లి నైవేద్యం పెడతారుకదూ!

అలాగే, నన్ను నీకర్పణ చేసుకోవడంలో కొద్ది

మాత్రమే అర్పణ చేసుకున్నానని

సందేహమా అమ్మా!

లేదమ్మా,

నేను మామిడిపండు రసాన్ని నీకు

నైవేద్యంగా ఇస్తున్నాను.

ఇందులో, గిల్లటాలూ పంచటాలూ లేవమ్మా!

నమ్మవూ!!

108. తప్పులు చేయడం నాస్వభావం.

కానీ క్షమించి వాటినుంచి నన్ను

విముక్తుడిని చేయటం నీ స్వభావం!

ఫలభరితమైన వృక్షాన్ని రాళ్ళతోకొట్టినా అది

స్వాదుఫలాలనే ప్రసాదిస్తుంది కదమ్మా!

అలాగే,

రూపుదాల్చిన పాపాన్నైన నేను నిన్ను

బాధపెడుతున్నాను

కానీ,

నీవు నన్ను బాగుచేయగలవనే ఆశమటుకు

మాసిపోదమ్మా !!

109. ఇత్తడి ఉంటేగానీ బంగారానికి విలువలేనట్లు
విషం ఉంటేగానీ అమృతానికి అర్థంలేనట్లు
చీకటి ఉంటేగానీ దీపం ప్రకాశించనట్లు
నగలో పొదిగితేగాని వజ్రానికి అందంరానట్లు
నీ అందం అంద విహీనులమధ్యగానీ, శోభించదనీ
నీ మంచితనం దుర్మార్గుల మధ్యగానీ ప్రకాశించదనీ
నీ ప్రేమ ప్రేమ నెరుగని వారిమధ్యగానీ
అందగించదనీ,

అనుకున్నావేమో!

లేకుంటేనన్ను
ఇంత అందవిహీనుడగానూ,
ఇంత చెడ్డవాడు గానూ,
ఇంత ప్రేమ హీనుడులాగానూ
ఎందుకు తయారు చేస్తావు?

110. గోధుమరంగూ, కాషాయిరంగూ గుడ్డలు
వేసుకున్నానమ్మా
కుక్కలుగూడా అదేరంగులో ఉంటాయేమో
అన్నదమ్మా ప్రపంచం।
పోనీలే, అని గుహలలో ఉందామనుకున్నానమ్మా।
ఎలుకలు చేసేపనిగూడా అదే
అన్నారమ్మా అందరూ.
అడవులలోకి వెళ్ళి కూర్చుందాం ఒంటరిగా
అనుకున్నాను నేను.
కోతిలానా, అని పరిహసించారమ్మా।
జడలు పెంచుకుంటేనన్నా గౌరవిస్తారేమోననుకుంటి
ఎలుగుకుగూడా అట్టలుకట్టిన జుట్టేనని
పరిహసిస్తున్నారమ్మా।
అందుకనే నీపాదాల దగ్గరికివచ్చి కూర్చున్నానమ్మా।
ఇప్పుడేమని పరిహసించగలరు నన్ను॥

111. ఎవరు రమ్మన్నారు నిన్నిక్కడికి
అంటున్నావు గదూ,
పంచదార దగ్గరికి పొమ్మని చీమకూ
తేనెను వెతుక్కోమని తేనెటీగకూ
ఆహారంకోసం చూడమని క్షుధార్తుడికీ
వైద్యుడి దగ్గరికి వెళ్ళాలని రోగికీ....
ఎవరు చెప్పాలమ్మా!

112. ఒకేసముద్రంలో గులకరాళ్ళు మంచిముత్యాలు
ఉండవచ్చు
ఒకేఆకాశంలో నక్షత్రాలూ చంద్రుడూ గూడా
ఉండవచ్చు
ఒకేభూమినుంచి బొగ్గూ, వజ్రాలు గూడా
దొరుకుతాయి
కానీ,
ఈ ద్వంద్వాలు సమానాలు కావుగా!
అలాగే, నీవూ, ఇతరులూ సమానాలెలా
అవుతారమ్మా!

113. నీలో లేని గుణం చంద్రుడికోటుందమ్మా!
రాజయక్ష్మ!
నీలో లేని గుణం సూర్యుడికోటుందమ్మా!
లోకతాపనం!
నీలో లేని గుణం వృక్షతతులకోటుందమ్మా!
మోడువారటం!
నీలో లేని గుణం సముద్రానికోటుందమ్మా!
ఎగసిపడటం!
నీలో లేని గుణం నదులకోటుందమ్మా!
ఆత్రపడటం!
నీలో లేని గుణం మహర్షులకోటుందమ్మా!
శపించడం!
నీలో లేని గుణం దేవతలకోటుందమ్మా!
పలకకపోవడం!
నీలో లేని గుణం నాకోటుందమ్మా!
నీకోసం తపించడం!

114\. అగ్నికి జ్వలనమూ
వారికి చలనమూ
సహజ గుణాలైనట్లే,
మనిషికి మరణము,
అమరుల కనిమిషత్వము
సహజాలైనట్లే
నీకు ప్రేమించడమూ,
నాకు ప్రేమించబడటమూ
సహజాలేమో!
ఔనా అమ్మా!

115. గాలిపటంలా నన్ను ఆకాశంలోకి ఎగరవేశావు నీవు.

పసిపిల్లవాడి దృష్టి చేతిలోదారంమీదగాక పతంగి

మీద ఉన్నట్లే

నీ దృష్టి కూడా పైన గాలిలో పల్లటీలు

కొడుతున్న నామీదఉంది.

కానీ, అమ్మా!

నేను గాలిలో పల్లటీలు కొట్టటానికి దారం

ముఖ్యమమ్మా!

నీ దృష్టి కొంచెం దారంపైన ఉంచకపోతే దారం

తెగిపోతుందేమో!

నేను గాలిలో కొట్టుకొని పోతానేమో!

జాగ్రత్త సుమీ!

116. నీవు దొంగలాగా ఎప్పుడో వచ్చావు
నా ప్రేమను కొల్లగొట్టి మోయగలిగినంత
తీసుకొని పారిపోయావు.
నీవు వెళ్ళిపోయాక చూచుకున్నాను నేను
ఇంకా చాలా మిగిలి ఉన్నదని
మళ్ళీ కొల్లగొట్టడానికిరావా!
అప్పుడు నిన్ను పట్టుకొని బంధిద్దామని
అనుకున్నాను
పైకి ఎవరితోనూ అననుగూడా లేదు
మరి నా మనసులో ఊహ నీకెలా తెలిసిందో
ఇంతవరకూ మళ్ళీ రాలేదు నీవు,
ఎదురుచూడలేక నా ప్రేమ ధనమే నాకు వెక్కసమై
పోతున్నది!
ఊరికే ఇచ్చేస్తాను, అంతా తీసుకోఅమ్మా!
అనడం మొదలెట్టాను
కానీ నీకింకా నమ్మకం కుదరలేదేమో
ఇంతవరకూ వస్తాలేవు! మరి!
ఎప్పుడు వస్తావో....

117. మబ్బులకు పైరులతో పని లేకపోవచ్చునేమో!
కానీ వర్షం కురియందే పైరులు
బ్రతకగలవా అమ్మా!
పూవుకు మధుపాలతో పనిలేకపోవచ్చు!
కానీ మధుపానికి పూతేనె లేనిదే
ప్రాణమెలా నిలుస్తుందమ్మా!
నదికి దాహార్తునిమీద ప్రేమలేకపోవచ్చు!
కానీ నది నీరాలు తాగకుండా పిపాస
చల్లారేదెలా అమ్మా!
నీకు నాతో పనిలేకపోవచ్చు
కాని నిన్ను ప్రేమించందే
నీవు లేనిదే
నా బ్రతుకుకు అర్థమేముంటుందమ్మా!

118. ఆకాశంలోకి పైకి ఉమ్మివేస్తే
తన ముఖానే పడినట్లు
బురదగుంటలో రాయి విసిరితే
తనమీదనే చిందినట్లు
ఏవేవో చేయఁబోయి!
నా మెడకే ఉచ్చు తగుల్చుకుంటుంటాను నేను!
మరి ఈ తెలివితక్కువ పోయేదెలా అమ్మా!

119. దేహాభిమానం లేనివాళ్ళందరినీ
నువు రక్షించేదే నిజమయితే
అడవి జంతువులన్నీ ముక్తి పొందుతాయి గదా!
బోడిగుండు చేసుకున్న మాత్రాన నీవు
కనపడేదే నిజమయితే
గొఱ్ఱె ఉన్ని కత్తిరించగానే నీవు
గొఱ్ఱెలకు కనపడతావన్నమాట!
ఏ దురూహలూ లేకుండా ఫలాపేక్ష లేకుండా
చేసే కార్యాలకు
ముక్తి లభించడమే నిజమయితే
రాళ్ళకూ చెట్లకూ భగవంతుడిని చేరడం
సులభం కదా!
ఇంత పోటీ ఉంచితే నేనెలా నెగ్గగలనో
నీవే చెప్పమ్మా!

120. రాతితోనూ మట్టితోనూ
పాలరాయితోనూ లోహాలతోనూ
దేముళ్ళను తయారు చేశాను.

కానీ,

కొన్ని విరిగిపోతే, కొన్నిటికి చెదలు పట్టాయి
కొన్ని దొంగలెత్తుకు పోయారు
తమనే రక్షించుకోలేనివాళ్ళు
నన్ను రక్షించలేరని అప్పుడు తెలిసింది నాకు.

ఇప్పుడు,

సజీవ మూర్తివైన నిన్ను నెలకొల్పుకొన్నాను
నా దేవాలయంలో
తన్ను రక్షించుకోడమెలా ఉన్నా
ముందునాకు రక్షణ ఉంటుంది గదా అని.
'ఎంతస్వార్థం' అంటున్నావుగదూ....

121. ఎదురుగా ఉన్నది నిధి నిక్షేపాలున్న
భవనమే అయినా
అవి తెరచి అనుభవించాలంటే తాళంచెవి
ఉండాలిగదమ్మా!
పారిజాత సుమాల వాసన మత్తెక్కిస్తున్నా
అవి కోయాలంటే చేతులూ ఆఘ్రాణించడానికి
నాసికా కావాలి గదమ్మా!
నీవు ఎంతగా మమ్మల్ని ప్రేమిస్తున్నా
నిన్ను అర్థం చేసుకునే పుస్తకం నీవే
ఎక్కడో
మాకు అందకుండా దాచావు
మరి ఇందులో నా తప్పేముందమ్మా!

122. పూర్వకాలంలో

నాకు రెండుతలలూ నాలుగుకాళ్ళూ

నాలుగుచేతులూ ఉండేవట!

తీరా అందులో ఒక భాగానికి ఇంకోభాగంమీద

కోపం వచ్చిందట!

ఇంకేముంది!

నానుంచి విడిపోయిందట ఆభాగం!

వెతగ్గా వెతగ్గా ఆభాగం నాకు జిల్లెళ్ళమూడిలో

నీలో

దొరికింది!

కానీ,

ఎంత ప్రాధేయపడినా నన్ను తనలో

కలుపుకోడానికి అంగీకరించడం లేదు

నీవు.

ఏంచేయనమ్మా!

123. తూనీగలకు ముళ్ళుగుచ్చడం ఎవరికో
ఆనందం చేకూర్చినట్లే
తేళ్ళకు కాళ్ళుగట్టి ఆడించడమూ
పాముకోరలూడదీసి సంతోషించడమూ
చిలుకను పంజరంలో ఉంచి ఆనందించడమూ
కొందరికి అలవాటైనట్లే
నన్ను ఏడుపించడం బాగా మరిగావు నీవు.
అయినా, అదేమి ఆనందమమ్మా!

124. నిద్రపోదామని ఓ క్షణం పాటు
కళ్ళుమూసుకున్నానమ్మా!
నీవు కనిపించావు!
దొరికావులే అని చటున కళ్ళు తెరిచానమ్మా!
ఏముంది! అంతా శూన్యం మిగిలింది!
నీవెక్కడున్నావు?
అందరూ మేలుకున్నప్పుడు నిన్ను చూచి
నిద్ర పోయేవేళకోలుపోతే
నేను రెండు కళ్ళు తెరిచిపెట్టుకునీ
నిన్ను చూడలేక పోతున్నాను.
ఇదేమి దౌర్భాగ్యమమ్మా!

125. అమరులు మృత్యువుపాల బడటమూ
కాష్టమే అగ్నిని భస్మం చేయడమూ
గాలి మేఘాలకు భయపడటమూ
మనిషిని కాటంది సర్పం మరణించడమూ
కుందేళ్ళు సింహాలను ఎదుర్కొవటమూ
నిన్ను ప్రేమించకుండా ఉండటంలానే
దుస్సాధ్యాలమ్మా!

126. నీళ్ళు తగిలిన మాత్రాన ఉప్పు కరిగిపోయేటట్లే
చల్లగాలి తాకిన మాత్రాన
మేఘాలు వర్షించినట్లే
నీవయు సోకిన మాత్రాన నా మనసులో
నీ ప్రేమ మొలకెత్తిందేమో!
ఇందులో నీగొప్ప ఏముందమ్మా!

127. కపోదికి వంకర టింకరల మార్గం చూపించేటట్లు
కోతికి మంచి నేర్పుదామని కల్లు తాగించినట్లు
నీవేదో, నాకర్థంలేని భాషలో, నాకేవేమో
చెపుతున్నావమ్మా!
అమృత ప్రవాహం దగ్గరకూడా
దాహం తీరకపోతే
కష్టపడి అంతదాకాపోవడ మెందుకమ్మా!

128. నా ప్రేమ నీప్రేమను కరిగించడం లేదని విసుగెత్తి
మళ్ళీ నిన్ను ప్రేమించకుండా
ఉండే దశకు పోదామనుకున్నాను.
కానీ,
నేతినుండి పాలనూ
చక్కెరనుండి చెరకునూ
చితాభస్మం నుండి శరీరాన్నీ
వెలికి తీయడానికి చేసే ప్రయత్నాలలో
నా ప్రయత్నాలు నిరర్థకాలైనాయమ్మా!
ఇంకేం చేయను?
నీదయ వచ్చే శుభఘడియకోసం ఎదురుచూస్తూ
నీ ముంగిటనే కూర్చున్నానమ్మా!

129. అమృతానికి ఆకలైతే ఏ పక్వాన్నాలు భుజిస్తుంది?
సుధాంశుడికి చల్లదనం కోసం ఏ వట్టివేళ్ళ
వీవన దొరుకుతుంది?
సువాసన ఏవాసనల నాఘ్రాణిస్తుంది?
సముద్రమెక్కడ స్నానం చేస్తుంది?
ఇవన్నీ తెలిస్తే,
నిన్ను వర్ణించదగిన మాటలుగూడా
దొరుకుతాయేమోనమ్మా!

130. నీళ్ళు పలుచన చేయడానికి అందులో
ఏం కలపగలమమ్మా!
వెన్నను మెత్తగా చేయడానికి కల్వంలో నూరుతారా!
వెన్నెలను చల్లబరచడానికి మంచులో ఉంచుతారా!
ఈ పనులు చేయబూనినవాళ్ళను
పిచ్చివాళ్ళని అన్నట్లే,
నీ మంచి 'ఇంత' అనే నన్నుగూడా
అంటారేమో!
కదా అమ్మా!

131. పొదుగు ప్రక్కనేఉన్న గోమారి పాలువదలి
రక్తాన్ని మాత్రమే తాగినట్లు
కమలం పక్కనేఉన్న సుగంధాన్ని
కప్పగాక తుమ్మెద ఆస్వాదించినట్లు
అదృష్టహీనుడి ఇంట్లో ధనపు పాతరఉన్నా
వాడు దరిద్రాన్నే అనుభవించినట్లు
నా అదృష్టంగూడా ఉందేమో నమ్మా!

132. ధాన్యం భూమిలో నాటితే అవి మొలకలెత్తి
కరకులను వేస్తాయి
అప్పుడు ధాన్యం నశించినట్లా లేక
వృద్ధి పొందినట్లా?
అలాగే,
నిన్ను పొగిడినా,
కోప్పడినా,
ఎన్ని వెట్టి తలలు వేసినా
నా ప్రేమ వృద్ధిపొందుతోందో, నశిస్తోందో
తెలీడం లేదమ్మా!

133. పర్వతాలకు వెన్నెల స్పర్శ తెలియనట్లు
మంచుకొండలు చలికి వణకనట్లు
రాతికి చక్కిలిగింతలుండనట్లు
ఇసుకకు కస్తూరి వాసనరానట్లు
నా మనస్సులో నీవూ కనపడటం లేదమ్మా!

134. కలలో తగిలిన గాయం మానటానికి మందు
మేలుకోవడం మాత్రమే అయినట్లు,
బాధలను మరచి పోవటానికి మందు
నిద్రించటం మాత్రమే అయినట్లు
నా గాయం మానడానికి మందు
నీలోకి మేల్కొవడమే నమ్మా!

135. ఎవరైనా సూర్యుడిని చూపమంటే;
సూర్యోదయమైన తరువాత
సూర్యప్రకాశం సహాయంతో మాత్రమే
సూర్యుడిని చూపడం సాధ్యం!

అలాగే,

నిన్నెవరైనా చూపమంటే
నీవిచ్చిన చూపు సహాయంతో
నీ ప్రకాశంలో మాత్రమే
నిన్ను చూడటం సాధ్యం
అని చెబుతానమ్మా!
చెప్పనా!!

136. నీళ్ళలో పుట్టిన నాచు నీళ్ళను ఆవరించినట్లు
కంటిలో జన్మించిన కన్నీరు చూపును
అడ్డగించినట్లు
ఆకాశంలో రూపుదాల్చిన మేఘాలు
ఆకాశాన్ని మరుగు పరచినట్లు
నాలో ప్రభవించిన ఈ గర్వం
నాలోని నిన్ను మరుగు పరుస్తోందేమో
ననిపిస్తోందమ్మా!
నిజమేనా!

137. చెరుకురసం చెడిపోకుండా ఉండటానికి
అందులో ఉప్పు కలిపినట్లు
నీమీద నా ప్రేమ తిరిగిపోకుండా ఉండటానికి
ఈ దూరం సృష్టించావేమో!
ఔనా అమ్మా!

138. పూతేనె త్రాగేమధువం ఝంకారం చేయదమ్మా!

ఇవతల తిరిగే మధుపాలు చేస్తాయి!

నీటిలో మునిగిపోయేవాడు ఏం మాటాడగలడు!

ఒడ్డున ఉన్నవాళ్ళు హడావుడి పడుతారుగానీ,

ఆకలిగొన్నవాడు తృప్తిదీరా ఆరగించడంలో

నిమగ్నుడై ఉంటాడుగానీ,

ఆకలి తీరిన వాడితో సంభాషిస్తూ

కూర్చోడుగదమ్మా!

అలాగే,

నీప్రేమ నాస్వాదిస్తున్న నేనేం మాటాడనమ్మా!

139. గుండ్రాతిపై పాలుపోసినా అందులో
మొక్కలు మొలవనట్లు
గంజి నీళ్ళను ఎంత చిలికినా వెన్న లభించనట్లు
పాము కుబుసాన్ని తొక్కినా అది కాటందలేనట్లు
వసంతఋతువు వచ్చినా ఆకాశం పుష్పించలేనట్లు
బూడిదలో ఎంత నేయి వేసినా అగ్ని ప్రజ్వరిల్లనట్లు
నాహృదయం ఏమి చేసినా నీవాసయోగ్యం
కావటంలేదెందుచేతో!
ఆ కిటుకేదో నీవే చెప్పరాదాఅమ్మా!

140. ప్రపంచాన్ని పంచుకోమని అందరికీ ఇచ్చావు
నిజమేనమ్మా!

అందరూ పంచుకున్నారు.
భూమినీ, చెట్లనూ, నదులనూ, ఆకాశాన్ని....
అన్నిటినీ....
తీరా ఇప్పుడు వచ్చాను నేను ఈ లోకంలోకి;
నాకెక్కడా కొంచెంచోటు ఉందా
అనుకుంటూ....
అంతా ఇంకొకరి స్వంతమైనదే,
కానిదేదీ మిగిలిలేదమ్మా!
ఇప్పటిదాకా ఏం చేస్తున్నావు మరి?
అని అడుగుతున్నావు కదూ!
నేను నీదగ్గరే ఉన్నానమ్మా ఆసమయంలో!
ఇక నాకెక్కడా స్థలంలేదు మరి,
నీ తోటలో ఖాళీ జాగా ఉందేమో!
చూడగలవా అమ్మా!

141. నీవు నాచుట్టూ ఒక వలయం గీచి నీవు ఇందులో
బందీవి అన్నావు
సరే!
నేనేనా అంత తెలివితక్కువ వాడిని?
నీవుగూడా లోపలికి వచ్చేలా
ఇంకో వలయంగీచి
మనమిద్దరం ఇందులో బందీలం
అంటున్నాను!
ఇప్పుడేమంటావమ్మా!

142. బూడిద అనుకొని నివురుగప్పిన నిప్పును పట్టుకొంటే
చేయికాలేటట్లే,
పంచదార అని తెలియక పోయినా నోటిలో వేసుకొంటే
తీయగా ఉన్నట్లే
నీ వెవరో నిజంగా నాకు తెలియకపోయినా, నీదగ్గర
అంతులేని శాంతి దొరుకుతున్నదమ్మా!

143. రొట్టెల దొంతర మోయటానికి బరువుగావున్నట్లు,
ఆవు పాలుపితికేవేళ పొడుస్తుందేమోననే
భయం ఉండేటట్లు
గులాబీలు కోసేవేళ ముళ్ళభయముండున్నట్లు
భోజనానికిముందు వంటచేయవలసిఉన్నట్లు
నీదరికి రావాలన్నా ఎన్ని గొడవలో॥

144. సూర్యుడు తనవంక చూచినా, చూడకున్నా
ప్రొద్దు తిరుగుడుపువ్వు సూర్యుడిమీదనే
దృష్టి నిలిపినట్లు
కలువలు ఎంత లోతునీటిలో ఉన్నా,
చంద్ర దర్శనంకోసం
సరోవరం ఉపరి భాగానికివచ్చి వికసించినట్లు
నీవునన్ను ప్రేమించినా,
ప్రేమించకున్నా
నేను నిన్ను ప్రేమించక మాననమ్మా!

145. పలకమీద అక్షరాలు తుడిచివేసినంత మాత్రాన
అక్షరాలు నాశనం ఎలా కావో,
నిప్పులో కరిగివేసినంత మాత్రాన బంగారం
విలువనెలా కోలుపోదో,
అలాగే,
నిన్ను 'తలచను' అనుకునే వాళ్ళుగూడా
నీ తలపులనుంచి తప్పించుకో లేరమ్మా!

146. సెలయేరులు అడ్డాలన్నిటినీ తోసికొని
గంగదాకా వెళ్ళినా
గంగ తనలో కలుపుకోనంటే
ఇనుము పరశువేదిని తాకినా బంగారంగా మారకుంటే,
నేను నీ దగ్గరికి వచ్చి మార్పు లేకుండాఉంటే
తప్పు ఎవరి దంటారుట??

147. ముత్యాలను బంగారంలో పొదిగితే
బంగారానికే శోభవస్తుంది.
అంతమాత్రంచేత ముత్యాలు విడిగా శోభించవా!
అందంగా ఉన్నవాళ్ళు ఆభరణాలు ధరిస్తే
ఆభరణాలకే అందం వస్తుంది!

అలాగే,
నీవు నాలోకి వస్తే నేను శోభిస్తాననే ఆశేగాని
నీకు శోభలేదని కాదమ్మా!

148. నహుషునికి ఇంద్రపదవి వచ్చినా
తెలివితక్కువ తనంచేత పోగొట్టుకున్నాడు.
ఆ కిటుకేమిటో నా కిప్పుడు తెలిసింది.
అంచేత,
నీదయాంకపీఠంమీద కూర్చుందామనుకునేముందే,
పాదపీఠిగా నీవద్ద ఉండిపోతాననే ముందే
'నాకా' అర్హత 'నీయవమ్మా' అని
ప్రార్థిస్తున్నాను.

149. కామధేనువే తల్లి అయితే, పిల్లవాడు అడుకోవడానికి
చంద్రుడు కావాలన్నా వస్తాడు
కల్పతరువు పెరటిలో ఉంటే శ్రీమహావిష్ణువు తన
ఇంట్లో ఉండాలన్నా ఉంటాడు.
ఈ రెంటినీ మించిన నీవు నాదగ్గిర ఉండగా
నిన్ను కోరినకోరిక కోరకుండా కోరుతున్నానంటే
వింతేముందమ్మా!

150. నా శక్తినిమించిన రాగాన్నాలాపిద్దామని
వీణతీగలు ఇంకా ఇంకా బలంగా మీటాను
తీగలు తెగిపోయాయి.
తెగిన తీగలనుచూచి అందరూ నవ్వుతున్నారు.
ఈ వీణను నీ చేతులలోనికి తీసుకో అమ్మా!
నీ స్పర్శమాత్రతో ఈ వీణను
వివిధ రాగాలూ పలుకనీవమ్మా!

151. వీడికి నాదగ్గర ఏదో కావలసి ఉండి ఉంటుంది
లేకుంటే ఇంత వినయం చూపవచ్చాడా
అనేది నీ అనుమానం కావచ్చు!
కానీ,
తులసి మొక్క పెరిగి పెద్దదై నీడనిస్తుందనీ
జమ్మిచెట్లు తీయని ఫలాల నిస్తుందనీ
నీళ్ళుపోస్తున్నామా అమ్మా!

152. భూకంపం రాగానే జనం ఇళ్ళు విడచి పరుగెత్తేటట్లు
అగ్ని పర్వతం పొగలు కక్కటం మొదలెట్టగానే
సమీపస్థులు దూరానికి పరుగెత్తినట్లు
పరుగెడతాడులే వీడు కూడా
నేను కోపం నటిస్తే, అనుకొంటున్నావేమో!
ఇళ్ళు విడచినా భూమి నెర్రెలిచ్చి మనుష్యుల్ని
మింగదనేమిటి?
దూరం వెళ్ళినా రాళ్ళు, లావా మీదకురకదనేమిటి?
అలాగే నీకే కోపంవస్తే తప్పించుకోడానికి
ఏమూలలకు పరుగిడగలను.
అంచేతే,
నీకు ఇష్టమైనా,
నిష్ఠురమైనా
నిన్ను విడచిపోనమ్మా!

153. ఎంతకూ నీదయ రాక, విసుగుపుట్టినప్పుడు
ఏం? హాయిగా చనిపోతే సుఖంగా
ఉండవచ్చుగదా!
అనిపిస్తుందమ్మా
కానీ, అప్పుడుగూడా శాంతి దొరకక పోతే
ఇక చేయడానికేమీ ఉండదనేభయం
తొలగిపోవడంలేదు నాకు!

154. తీరికగా పొద్దు పదిబారలు పైకివచ్చాక లేవటం
ఫలాహారాలు చేయడం,
విందులు కుడవడం,
ఆపైన మందులు తినడం
మళ్ళీ నిద్రించడం
ఇలా గడచిపోతున్నదమ్మా కాలం!
కానీ,
నా జీవనకాలం అంతా ఇలాగే గడచిపోతే,
నాకో 'అమ్మ' ఉందనీ,
ఆమె జగత్తుకే అమ్మనీ,
చెప్పే అవకాశం ఏదమ్మా?

155. నీ ఇంటికి వస్తానుగా అన్నావు,
నిజమే!
నీ శక్తి పదును పరీక్షించు కోవడం
నీకు అవసరమే కావచ్చు!
కానీ,
ఆ పరీక్ష, నాకంఠం పైన
ఎంత కాలం వరకూ?
అనేదే
నా ప్రశ్నమ్మా;

156. మానవులను సృష్టించావు, బాగానే ఉంది.
వెలుగు కోసం సూర్య చంద్రులనూ,
పానీయం కోసం నదులనూ,
ఆహారం కోసం ఫలాలనూ.
అన్నిటినీ సృష్టించావు,
నీ ప్రేమ గొప్పదే, మాపట్ల, కాదనడంలేదు,
కానీ,
ప్రేమ అనే బలహీన మైన దారంతో
మా హృదయాలను కట్టివేశావమ్మా!
ఎంత వింతో!!

157. కోకిలకు పాటలు నేర్పావునీవు
అది ఆపాటలచేత నిన్నానందింప జేస్తోంది
నాకు మూగతనాన్ని వరంగా ఇచ్చావు
కానీ పాటలు పాడమంటున్నావు
నెమిళ్ళకు నాట్యాన్ని నేర్పావేమో నువ్వు
అది నీముందు, నీకోసం అందంగా
ఆడుతున్నాయి
కానీ, నాకేమీ నేర్పలేదు నువ్వు!
ఆడమని మాత్రమే ఆజ్ఞాపిస్తున్నావు!
సరే!
నా చేతనైనంతవరకూ నిన్ను
సంతోషపెట్టానమ్మా!
తప్పులుంటే దెప్పకేం!

158. కట్టుకొయ్యకు కట్టివేసిఉన్న
దూడ ఆకలి తీర్చడం కోసం
ఆవు వస్తుంది గదమ్మా!
భూమిమీద పైరులు తన దగ్గరికి రాలేక పోవడంచూచి
మేఘాలు వర్షంతో వీటిని పోషిస్తాయిగదమ్మా!
అలాగే,
నీ దగ్గరికి నేను రాలేక పోవడంచూచి
నీవైనా నాదరికి రావా!
అని నా ఆశమ్మా!

159. స్వచ్ఛమైన మంచుకణంగానో
అప్పుడే విరిసిన పారిజాతంలానో
పండిన సంపెంగలానో,
మారిపోయి
నీ పాదాలమీద ఒరిగిపోవాలని
ఉందమ్మా!

160. అమ్మా
నీ ప్రేమ మా ప్రపంచాన్నంతా చుట్టుముట్టి
ప్రతి అణువునూ తనలో
మనకు వేయిస్తుంటే.
ఇంతే ఈలోకాంలో,
ఇంత దుఖఃమూ, ఇంతశోకమూ
మిగిలి ఉన్నాయేమమ్మా?
ఒకవేళ,
దుఖఃము, శోకము మాత్రమే
నీ వరాలయినట్లయితే,
అందరినీ స్వర్గానికి, అంటూ
దోవ తప్పిస్తావేమమ్మా!

161. గాలి తగలని చోట ఉంచి,

భద్రంగా దాచానని అనుకున్నా,

పూవులు వాడి పోతాయమ్మా!

ఒంటి స్తంభం మేడ సముద్రమధ్యంలో కట్టుకొని

అందులో కాపురమున్నా

మనిషికి వార్థక్యం రాకమానదు కదమ్మా!

అలాగే,

గాలితగులకపోతే మనుష్యుడు వాడిపోతాడమ్మా,

కాలం ఊరు కోదుగా;

మరి, నాకాలం తీరే లోగానే,

నీ ప్రేమామృతాన్ని నాకందనీయవూ!

నీవు నాదరికిరావా!

162. అందరికీ రసభరితమైన ఫలాలే కావాలి గానీ.

పడిలిపోయిన ఆకులూ, ఎండిపోయిన

ఆకులూ ఎవరికి కావాలమ్మా!

అందమైన వాటిని చూడాలని ఉంటుందిగానీ,

అంద వికారంగా ఉన్న వాటిని

చూడాలని ఎవరనుకుంటారు.

కానీ,

ఫలాలను అందరూ కోసుకుంటే

వృక్షాలు తమ చల్లని నీడలో ఆకులను

తమ ఒడిలోకి తీసుకొని

తన ప్రేమతో వాటి జీవితాలను

పులకింప చేస్తాయేమో!

అలాగే,

మంచివాడినైతే ఇతరులచేతనే పడేవాడని

చెడ్డవాడిని గనుకనే నీ ఒడిలో చేరుతున్నాను

మరి నా చెడ్డతనానికి ధన్యవాదాలు

చెప్పుకోనా అమ్మా!

163. శ్రీమహావిష్ణువు సుదర్శనచక్రాన్నీ,
శంభువు త్రిశూలాన్నీ,
యముడుపాశాన్నీ,
వరుణుడు గాండీవాన్నీ,
ఆయుధాలుగా సంపాదించుకొని,
తమంతవారు లేరనుకున్నారు,
కానీ,
నీవు 'ప్రేమ' అనే ఆయుధంతో
ఎందరిని ఓడించి
నిస్సహాయులుగా చేస్తున్నావో చూస్తే,
వాళ్ళు తమ తెలివి తక్కువకు
నివ్వెరపోరటమ్మా!

164. తనదాహం తీరడానికి ఒక చిన్న చెంబెడు
నీళ్ళు సరిపోయినప్పుడు
మొత్తం చెరువులో ఉన్న నీళ్ళెన్ని
అనే ప్రశ్న ఎందుకమ్మా?
ఒక అరగ్లాసు సారాయితో కైపెక్కి కళ్ళు
మూతలువడే వేళ
గిడ్డంగిలో ఉన్న సారాయమెంతో ఎందుకమ్మా?
ప్రేమభరితమైన నీచూపుతో
సంతృప్తి చెందే నాకు
నీ ప్రేమవాహినికి అంతు ఎక్కడా
అనే చింత అందుకనే లేదమ్మా।

165. నీవెవరో,
నీకెంత సొత్తు ఉన్నదో,
నీవు మహారాణివో లేక మహాకాళివో,
ఎవరవో నాకవసరం లేదమ్మా!
నీవు నాకు అమ్మవు;
ఆ భావనే అంతులేని తృప్తిని
ప్రసాదిస్తుంది కదమ్మా!

166. నీవు సృష్టించావు ఈ సూర్యచంద్రులనూ
ఈ నక్షత్రాలనూ,
ఈ ప్రపంచాన్ని
ఆహా! ఎంత అద్భుతంగా ఉన్నాయి ఇవి
అని మెచ్చుకుంటారే గాని,
ఈ తోట సొంతదారువైన నిన్ను
మెచ్చుకోరేమమ్మా!
అయినా నిన్ను మెచ్చుకోడమెలాగో
ఎవరికి తెలుసు గనక!

167. భానుడు దూరానికి చిన్న బింబంలానే కనపడుతాడు
కానీ, దగ్గరకు వెళ్ళగలిగితే
కొన్ని ప్రపంచాలు కలిసినంత ఉంటాడు,
అలాగే, మినుకు మినుకు మనే నక్షత్రాలు
దగ్గరకు వెళ్ళగలిగితే
సూర్యుని కన్న ఎన్నోరెట్లు కాంతి
వంతాలయిన, ఉష్ణభరితాలయిన గోళాలు,
అలానే, నీవు కంటికి చిన్నగా కనుపించినా,
నిన్ను అర్థం చేసుకోగలిగిన వారికి
ఎలా కనపతావో!
ఊహ కందడం లేదమ్మా!

168. నిజమేనమ్మా!

నీకాలంలో జన్మించి నిన్ను చుడగలుగుతూ

ఉండటం నా అదృష్టమే!

కాదనడంలేదు!

సముద్రపు ఒడ్డున ఉన్న గడ్డిలాటివాడిని నేను,

సంద్రపుటలలనుతాకేఆశాలేదు

ఆజలాలతో జీవనాన్ని నింపుకోనే

అవకాశమూ లేదు.

సముద్రునికి దయ రాకపోతుందా

అని ఎదురులు చూడటమే

ఆగరికకు మిగిలునట్లు,

నీకోసం ఎదురులు చూడటమేనమ్మా!

నేను చేయగలిగిందిగూడా!

169. సాగరవారి నీలంగా కనుపించినా
చేతిలోకి తీసుకొంటే ఏరంగులేనట్లే,
నీకు ప్రేమా, కోపమూ రెండూ ఉన్నట్లు అనిపించినా.
కష్టాలు ఇష్టాలు ఉన్నట్లు కనిపించినా,
దగ్గరికి వెళితేకరిగిపోయే గగన నీలంలా,
కరిగి పోతా మేమోకదమ్మా;
నీలో.

170. నిజమే!
నా తెలియనితనంలోనే నిన్ను చేరాను,
నామూర్ఖత్వంతోనే నీపాదాలు పట్టుకున్నాను
నామనస్సును అదుపులో ఉంచుకోవాలని
ఎంతో ప్రయత్నించా నిన్నాళ్ళు.
కానీ,
ఇప్పుడు శక్తి అంతా ఉడిగి పోయింది.
నాభారం అంతా నీకు వదలి పెడుతున్నానందుకే
కుక్క పాతగుడ్డను విదలించినట్లుగా
గండుపిల్లి పిల్లికూనలను విదలించినట్లుగా
లోభి బిచ్చగాడిని విదలించి నట్లుగా
విదలించినాసరే;
వదలనమ్మా నిన్నిక!

171. నేను

ఆనందంతో ఉరకలు వేస్తున్నది

అలసటతో విసిగి పోయిందీ ఎవరికి కావాలి?

ఎక్కడో,

అడవిలో ఉన్న సెలయేరు ఎండితే ఎవరికేం?

నిండితే ఎవరికేం?

అసంఖ్యాకమైన తారకలలో ఒక చిన్నచుక్క

మినుకుమంటే ఎవరిక్కావాలి? రాలిపోతే ఎవరికికావాలి?

కానీ,

నీకక్కర లేకపోయినా

నామాటలూ, పాటలూ,

ఆటలూ, జీవనాలూ,

ఎవరికోసమమ్మా!

నీకోసం కాకుంటే?

172. పచ్చని పసరిక

విచ్చిన గులాబీ

నొచ్చని విధంగా కురిసే వర్షం

భూమిమీద మురికిని కడిగివేయ గలిగినట్లే

ఎవ్వరి మనస్సూ నొవ్వకుండేలా ఉన్నమాటలు

మాలో మకిలను కడిగివేస్తాయని అమ్మా!

173. సాగరతో యాలెన్నో
దోసిళ్ళతో కొలుద్దామనుకొనే వెర్రిలా
ఆకాశంలో నక్షత్రా లెన్నో
వేళ్ళమీద లెక్కించే పిచ్చివాడిలా
ధరణిమీద ఇసుక ఎంతో
మానికలతో కొలతవేసే మూర్ఖునిలా
నాకున్న చిన్న హృదయాన్ని కొలతగా
నీ ప్రేమ కొలుస్తున్నాను
నన్ను చూసి నవ్వుతున్నావు గదమ్మా!

174. అసలుట,
నాలాటివాడు నీదరికి వస్తే గాని
నీ కీర్తి ప్రకాశించదటమ్మా!
ఎందు కంటావా అమ్మా!
కల్పవృక్షం క్రింద ఎవరూ కోరికలే కోరకపోతే,
దానికి పేరెలా వస్తుందమ్మా!
అలాగే
నన్నుద్ధరిస్తే గాని నీకు పేరు రాదు మరి!
తర్వాత చెప్పలేదని దెప్పేవు సుమా!
రహస్యం ముందే చెప్పాను నీకు మరి!

175. నా తెలివి తక్కువ కళ్ళకు
నా తెలివి అంచీలమీద పరుగిడుతూ
అభివృద్ధి చెందుతున్నట్లు
కనపడుతున్నదేమో!
అందుకే కాబోలు
నేను గుడ్డివాడనయినా
కళ్ళున్నవాళ్ళందరికీ అది కా దిది అంటూ ఏ
వేవో చెప్పబోతాను.
ఈ నా తెలివిని మండించవా అమ్మా!

176. సుముహూర్తం చూసుకొని వెళదాంలే
వీడివగ్గరకు అనుకుంటున్నావా అమ్మా!
వశిష్ఠ మహామునివంటి జ్ఞాని ముహూర్తంపెట్టి
పెండ్లి జరిపించినా
సీతాపహరణమూ
సీతారాముల వనవాసమూ
దశరథుని మరణమూ
జరిగాయి కదమ్మా!
లగ్న బలిమికంటే
నీ బలమే ఎక్కువని నాకు తెలుసుగానీ,
ఇంక రావమ్మా!

177. ఏనుగుకు అభ్యంగనస్నానం చేయించినా
తిరిగి అది శిరస్సుపై ధూళినే చల్లుకునేటట్లు
కుక్కకు పంచభక్ష్య పరమాన్నాలతో విందు కుడిపినా
ఎముక కనిపిస్తే అది దానిని వదలనట్లు
కోతికి వజ్రఖచిత కిరీటం ధరింపచేసినా
ఇతరులకు వెక్కిరించేబుద్ధి
అది పోగొట్టుకో లేనట్లు
గద్దవంటికి శ్రీచందన లేపనమూ,
కంటికి అంజనమూ ఉంచినా
దాని దృష్టి నేలపైనున్న పీనుగులపైనే ఉన్నట్లు
నీ ప్రేమామృత భోజనం చేస్తూగూడా
ముల్లంగిదుంపల కూరరుచి తల్చుకుంటున్న
నన్ను క్షమించవూ!
ఏమమ్మా!

178. నయన హీనుడికి నాకు దోవ చూపించావమ్మా, నిజమే
కానీ, అడుగడుగునా ఎదురుదెబ్బలే
పలుకరిస్తున్నాయమ్మా!
నాలుగుదిక్కులా అంధకారమే గాక
నాకేమీ కనపడటంలేదు
కానీ, నీఇంటి ద్వారాన్నెలా నమ్మా మానడం!
ఒక్కసారి నాచేతిని పట్టుకొని, నా మనస్సులో
జ్యోతిని వెలిగించవా అమ్మా!
ఆ కాంతి సహాయంతో నీపాదాలు
చేరగలుగుతా నేమో!

179. నా భిక్షాపాత్రను ముందుకు చాచి
భిక్షాం దేహి అంటున్నాను, నీ ఇటి ముంగిట
నీకూ తెలుసు స్వయంగా ఏమీ తీసుకొనడానికి
నేను అర్హుడను కానని
పేదను గనుక కొననూ లేను
అందుకే నిన్ను అర్థిస్తున్నానమ్మా!
నీ ప్రేమకోసం!

180. పుష్పాలు యెందుకు వికసిస్తాయో నాకిపుడు తెలిసింది
నిన్ను చూచే ఆశతో
అవి ఎందుకు వాడిపోతాయో గూడా తెలుసు
నీవు రాకపోవడంవల్ల
అవి ఎందుకు రాలిపోతాయో గూడా తెలుసు
నీ వా దోవన రాకపోతావా అనే ఆశతో
అనునా అమ్మా!

181. మనిషి మనసులోని మంచీ
వలపులలోని తీపీ
అనుభూతులలోని ఆనందమూ
మాటల కందనట్లే
నీవూ ఎవరికీ అందవు!
ఔనా అమ్మా!

182. చేప నిద్రిస్తున్నా కళ్ళు తెరచుకొనే ఉంటుందట!
జాతిగల గుఱ్ఱం నిలబడే నిద్రపోతుందట
పక్షులు కొమ్మలమీద
కూర్చునే నిద్రిస్తాయి
కానీ పరిసరాలలో జరిగేవి వాటికి
అప్పుడు తెలియవుగా అమ్మా!
అలాగే,
నేనూ కళ్ళు తెరచుకొని ఉన్నా ఏమీ చూడలే నమ్మా
చెవులు దోరగిలపెట్టుకొనీ వినలేను నీ మాటలను
ఏం చేయనమ్మా!

183. మానవుడు మరణించడానికి చాలా దోవలున్నా యమ్మా
ఆహారం లేకున్నా
నీరు లేకున్నా
ప్రాణవాయువు లేకున్నా
జీవజ్యోతి ఆరిపోతుంది
ఇవి గాక హఠాత్సంభవాలు వేనకువేలు
కానీ,
ఇవేమీ 'నీవు' లేక కృశించి నశించడం కన్నా
బాధాకరాలు కావమ్మా!!

164. సముద్రగర్భంలో బడబాగ్ని ప్రజ్వరిల్లుతూ
ఉంటుందట!
నీటినన్నింటినీ ఆవిరిచేయగలుగుతున్నానా
లేదా, అని చూచుకోదది!
జలమధ్యానగూడా ప్రజ్వరిల్లుతూ ఉండటమే
ఆ వహ్నికి గర్వకారణం
అలాగే,
నా ప్రేమ నిన్ను కరిగిస్తుందో లేదో
నా కనవసరం
నిన్ను ప్రేమిస్తూ ఉండటం మాత్రమే
చాలునమ్మా నాకు

165. మధురమైన భక్ష్యాలే అయినా,
నిలవ ఉంచితే చెడిపోతా యమ్మా
పాలైనా ఎక్కువ కాలం అలాగే వుండవు! విరిగి పోతాయి
పైగా స్వాదు మధురాలే చెడిపోయాక తిక్తాలూ
విషసమానాలూ అవుతాయిగూడా!
కానీ, ఓ మధుర పదార్థం మటుకు
ఎల్లకాలం అలాగే ఉంటుంది
చెడకుండా!
ఏమిటో చెప్పనా అమ్మా!
నీవే!!

186. పోకచెట్లూ, ఖర్జూరవృక్షాలూ
అవి ఆకసాన్నంటేలా పెరిగినా
చిన్న చిన్న కాయలను మాత్రమే అందించగలవు
గొప్పవాళ్ళమని డంబాలు కొట్టుకునే
సాధువులు అందించే ఆనందంలా!

కానీ,
అంటుమామిడి చెట్టు పండ్లు నుంచుంటే చేతికందీ
అతి మధురంగా ఉంటాయి!
ఏమీ తెలీదని చెబుతూ నీవు చెప్పే మాటలలా
ఔనా అమ్మా!!

187. రక్తమందారాలూ, బొండుమల్లెలూ
ఒకే చెట్టుకి పూయనట్లే
ప్రేమ, ఈర్ష్య లేకుండా ఉండటమూ
ఒకే చోట ఉండవటమ్మా!

కానీ నీ సంగతి వేరు!
పారిజాతకుసుమం మందార రక్తిమము
మల్లెల ధావళ్యమూ
సంతరించుకొన్నట్లే
నీవద్ద ప్రేమా, అనసూయత్వమూ గూడా
ప్రోదిచేసుకొన్నావమ్మా!

188. శశిరంలో సూర్యుడూ, గ్రీష్మంలో చంద్రుడూ
ఆనంద దాయకులే అయినా
గ్రీష్మంలో మార్తాండుడూ శశిరంలో చంద్రుడూ
బాధాకారకులే అవుతారు

కానీ,
ఎన్ని ఋతువులు మారినా, ఏ కాలాన అయినా
నీ పాదాలదగ్గర పొందే ఆనందంమటుకు
మాసిపోదమ్మా!
మారిపోనూ పోదు!!

189. మెత్తని బూరుగుదూది పరుపుపై గూడ
నిద్రపట్టక బాధపడే వాడొకడయితే
కటికి నేలపైనే గాఢంగా నిద్రించగలుగుతాడు
మరొకడు
పాయసాన్నాలు భుజించినా తృప్తిలేని వాడొకడయితే
గంజినీళ్ళతో కడుపు నింపుకొని
ఆనందించే వాడింకొకడు
అలానే,
నీ దగ్గర ఉండీ తృప్తిలేనివారూ,
దూరాన ఉండీ తృప్తిచెందేవారూ ఉంటారేమో
ఔనా అమ్మా!

190. నరాలలో రక్త ప్రసరణం వెలికి కనపడకపోయినా
జరుగుతుంటుందమ్మా
సరస్వతీనది కనపడకున్నా అంతర్వాహినిగా
ప్రవహిస్తూనే ఉంటుందిగదా!
అలానే,
బయటికి కనపడకున్నా నీవు
యీ జగతినంతా నీ వడిలోనే
ఉంచుకొన్నావేమో నగిపిస్తోందమ్మా!
నిజమేనా!!

191. పసిపాపడు నీచుట్టూ ఏం జరుగుతున్నా
తన "ఉంగా ఉంగా"లలో నిమగ్నమై
నవ్వుతుంటుంటాడు
రోమ్ చక్రవర్తి నీరో రోమ్ నగరం తగులబడి
పోతుంటే
వయొలిన్ వాయించేవాడుట
మరి నా మనస్తత్వం పసిపాపలా వుందో
నీరోలా వుందో తెలియడం
లేదమ్మా
నామూలాన ఇతరులకు కలిగే బాధను
గమనించనుగదా నేను
ఒకవేళ నీకుగూడా బాధ కలిగిస్తున్నా
నేమోనమ్మా
మన్నించవూ!!

192. రంగస్థలంమీద నటించే నటులకు
తమ తమ భాగాలు తప్ప నాటకమంతా రానట్లే
మాకూ మా విషయాలుతప్ప మిగతాకథ తెలీదమ్మా
కానీ,
నాటక రచయితకు అందరి కథలు తెలుసుగా అమ్మా
అలానే, నీకూ మాఅందరి కథలూ
ఆద్యంతం తెలుసునేమో!
ఔనా అమ్మా!

193. నేను దివ్వెనైతే, వెలుగూ వెలుగునీయడాని
కాధారమైన మూనెగూడా నీవేనమ్మా
నేను కొవ్వువత్తినైతే, మైనమూ వత్తీగూడా నీవేనమ్మా
నేను కస్తూరి మృగాన్నైతే, నీవు కస్తూరివమ్మా!
ఊరికే గర్జించి వర్షించే మేఘాన్ని నేనైతే
క్షాళన గుణంగల వారివి నీవు
నేను పసిపాపనైతే
నీవు నా అమ్మవమ్మా!,

194. నీ మంచితనంవల్ల నా దుర్గుణాలను

చూచీ చూడనట్లు ఊరుకుంటే

అవి ఎప్పటికి నశించేనమ్మా!

మేకలు చంపడం చూస్తూ ఊరుకుంటే

నరహత్యలు ఎంతో దూరం వుండవమ్మా

రాతిలో ఉన్న వజ్రాన్ని ప్రేమిస్తూ కూర్చుంటే

రాయి కరుగుతుందా అమ్మా

సుత్తెతో బద్దలుకొట్టక తప్పదుగా

అలానే, నన్ను క్షమించకమ్మా!

నీకోపంతో నామలినాన్ని భస్మం చేసేయమ్మా

స్వచ్ఛమైన నేను అప్పుడు

నీకు నమస్కరిస్తానమ్మా!

195. శబ్దం చొరని గదిలో బంధించి
ఇవతల ఉండి పాట నెంత మృదు మధురంగా
ఆలపించినా
గదిలోని వాడికి వినపడదమ్మా
నిజంగా నీకు నాపాటను వినాలని ఉంటే
నా గదిలోపలికి వచ్చి కూర్చుని
నీ పాటను వినిపించమ్మా
సరేనా!!

196. వసంతం కొత్తగా చిగురులు తొడిగిన లతకేగాక
వాడిపోయిన మోడులకుగూడా వచ్చినట్లే
శ్రావణ మేఘాలలో మెరిసిన తటిల్లతలు
మయూరాలకేగాక, మానవులకూ
ఆనందం చేకూర్చినట్లే
నీ పాదాలుగూడా, తెలిసినవారినేగాక
ఏమీ తెలియని నావంటి వాడికిగూడా ఆనందం
చేకూరుస్తున్నాయమ్మా!

197. కోకిల కాకి రెండూ పాడినా

రెంటినీ మెచ్చుకోం గద అమ్మా

నెమలీ, ఉష్ట్రపక్షీ, రెండూ నాట్యమాడినా

నెమలిని మాత్రమే గౌరవిస్తాం గదమ్మా

పచ్చని పసిరికపై జింకలూ, నక్కలూ ఉంటే

దృష్టి జింకలనే చూస్తుంది గదమ్మా

అలానే,

ఎన్నిటి మధ్య ఉన్నా నీవు మాదృష్టి

నాకట్టక మానవమ్మా

నీవు అలా ఉండాలనే నాకోరికగూడా....

198. నిన్ను చూడని వారు
భగవంతు డగోచరుడనీ
అవాచ్యుడనీ
అతీంద్రియుడనీ
ఏమేమో అన్నారు
కానీ,
నిన్ను చూచాక 'కనులారా నిన్ను చూస్తే
'అగోచరుడని ఎలా అన్నామా?'
అని నివ్వెరపోరటమ్మా?
కానీ, అందుకు వాళ్ళకు శిక్షగూడా వాళ్ళే
విధించుకొన్నారుగదమ్మా
అవాచ్యుడనీ, అతీంద్రియుడనీ అని,
నిన్ను కీర్తించే అవకాశం
చేతులారా పోగొట్టు కొన్నారు
గదా పాపం!
ఔనా అమ్మా!

199. నా సర్వస్వంతోటీ పూలసెజ్జను నింపి
నీ్రమోల ఈవరకే అర్పించాను
ఇవాళ నీకియడానికి నాదగ్గర ఏమీ లేదు
ఆకులన్నిటినీ రాల్చివేసి ఆకాశంవైపు
చేతులు చాచుకొని ఉన్న
మోడు చెట్టులా ఉన్నాను నేను
కానీ ఇంతవరకూ నేను నీపాదాలమీద ఉంచిన పూలలో
వాడిపోకుండా ఉండే పూవు ఒకటీ లేదా అమ్మా!!

200. హిగ ఆకాశంతోటీ,
బూడిద భూమితోటీ
మేమూ అగ్నికి సహోదరులమని
గొప్పలు చెప్పకున్నట్లు
నేనూ,
నీ బిడ్డనే
అని గర్వంగా చెప్పకుంటున్నానమ్మా
ఇక ముందు చెప్పకుంటానుగూడా
సరేనా!!!

201. సూర్యుడు భూమికన్నా, ఎన్నోరెట్లు పెద్దఅయినా
ఎంతో దూరాన ఉండటం మూలాన,
చిన్న చక్రంలా కనపడతాడు
తలక్రిందులుగా చేసి ఆలోచిస్తే
నీవు చిన్నగా ఉన్నావంటే
మేము ఎంతో దూరాన
ఉన్నామనేగా అర్థం
ఔనామ్మా!

202. ఎన్నడూ సముద్రాన్ని చూడనివాడు
సముద్రాన్ని వర్ణించమంటే
ఎవరు మాత్రం ఏం చెప్పగలరమ్మా
అక్కడ ఉంటే నీరు ఉంటుంది –
చాలా ఎక్కువగా ఉంటుంది.
ఎటు చూచినా, చూచినంతమేరా నీరుతప్ప
వేరేమీ కనపడదు
అనేగదా అమ్మా
అలానే,
మేము అమ్మను చూడలేదు, మీరు వర్ణించండి అంటే
అక్కడ ఎంతో ప్రేమ ఉంటుంది
ఎటు చూచినా, ఎంత దూరం చూచినా
మాతృప్రేమతప్ప వేరేమీ కనపడదు
అని మాత్రమే చెప్పగలమమ్మా

203. చీకటిలో ఉన్నవాడు తన విద్యుద్దీపిక కాంతి

ప్రసరింపజేస్తూ

అందరినీ చూడగలుగుతాడు

కానీ, తనపైతానే కాంతిని ప్రసరింపజేసు

కొనంతకాలం

ఎవరూ అతనిని చూడలేరుగా అమ్మా!

అలానే, నీకాంతి ప్రసరణలో నీకు అందరూ కన్పిస్తారు

కానీ,

కాంతి ప్రసరిస్తున్న నీవుమాత్రం

మాకు కనపడటం లేదమ్మా!

20 . భూతత్వ శాస్త్రజ్ఞుడు పరిశోధించి,

జల ఎక్కడ ఉందో కనిపెట్టి

బావి త్రవ్వి నీటిని ఉపయోగ పరచినట్లు

నీవు మనుష్యులలోని మంచిని కనిపెట్టి

బాగుచేస్తున్నావేమో ననిపించిందమ్మా

కానీ, శాస్త్రజ్ఞుడు జల ఉంటేగాని బావి త్రవ్వలేడమ్మా

మరి నీవో!!

ఏ కొంచెమూ మంచిలేని నాలాటి వాడిలోగూడా

మంచిని పెంచుతున్నావమ్మా

కనుక నీవే గొప్ప

కదూ!!

205. మేమంతా ఒకటి తర్వాత చేర్చిన
సున్నాలలాటి వాళ్ళమేమో
మా మా స్థానాలనుబట్టి మా విలువలు
ఉంటాయేమో

కానీ,
సున్నాలముందున్న ఒకటిని చెరిపేస్తే
సున్నాలకేమీ విలువ లేనట్లే
నిన్ను మినహాయిస్తే మాకూ ఏ విలువా ఉండదమ్మా!
ఔనా?

206. నీకన్నులకూ, వెన్నెలకూ ఒకే భేదం ఉందమ్మా
నీ చూపులో చల్లదనం వెన్నెలకు లేదు
నీ పదాలకూ గులాబీలకూ ఒకే భేదం ఉందమ్మా
నీపాదాల దివ్య పరిమళం గులాబీలకు లేదు
నీ మాటలలోని శ్రీయదనానికి అమృతానికి
ఒకే భేదం ఉందమ్మా
నీ పలుకులలోని రుచి అమృతానికి లేదు
అలాగే నాకూ నీకూ ఒకే భేదం ఉందమ్మా
నీలో చైతన్యం ఉంటే, నాలో జడత్వం ఉంది.
ఔనా అమ్మా!!

207. తన తలమీదనే దీపాన్ని ధరించినవాడు
దీపకాంతులను చూడలేడమ్మా!
తల్లి గర్భంలో ఉన్న పసిపాపడు
తల్లి మోమును చూడలేడు గదమ్మా
అలాగే,
నేనూ నీనీడలోనే ఆడుకుంటున్నానేమో!
అందుకేనేమో నీరూపు నాకు కనపడటంలేదు!
నిజమేనా అమ్మా!

208. పాపాలు చేసినవారిని గాకపోతే ఇంకెవరిని
పాపవిముక్తులను చేస్తావమ్మా!
అజ్ఞానికే గదమ్మా తెలివిని ప్రసాదించవలసింది
ఆకలిగొన్నవారికి కాకపోతే, ఇంకెవరికి ఓగిరమిడి
కడుపునింపగలవమ్మా!.!


——

నా హృదయంలో నీ పాదం
నీ పాదంపై నా ఫాలం
ఉండాలని నా ఆశమ్మా!

నాలో మ్రోగుతు నీ గీతం
నీ గీతమే పాడగ నా గానం!
ఉండాలని నా ఆశమ్మా!

నా అణువణువున నీ రూపం
నీ రూపమె చూడగ నా దేహం!

నా శ్వాసల నీ పాద పరిమళం
నీకీయగ నాకో హృదయం॥
ఉండాలని నా ఆశమ్మా
ఉండాలని నా ఆశమ్మా!!



గబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం



రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం

గబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం రాగబంధం